# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :73 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 10-05-2024 | పేజీలు:4 వెల: 2.00


## పిట్రోడా వ్యాఖ్యలతో రాహుల్, ప్రియాంకల కష్టం వృథా

న్యూఢిల్లీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మాజీ చీఫ్ సామ్ పిట్రోడా జాతి వివక్ష వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా తోసిపుచ్చారు. ఉన్న'త విద్యను అభ్యసించిన అలాంటి వ్యక్తి ఇంత'టి చౌకబారు వ్యాఖ్య'లు చేయడ0 త'ను ఆశ్చ'ర్యానికి లోనుచేసింద'ని అన్నారు. పిట్రోడా వ్యాఖ్యలను తాను అంగీకరించనని, ఆయన మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.గాందీ కుటుంబంతో కలిసి పనిచేస్తున్నప్పుడు మీరు మరింత బాధ్యతగా ఉండాలని, ఏదైనా మాట్లాడే ముందు ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల కోసం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కష్టపడి పనిచేస్తున్నారని, కానీ పిట్రోడా చేసిన ఒకే ఒక్క ప్రకటనతో బీజేపీకి దీన్ని ఓ అంశంగా మలిచే అవకాశం కల్పించారని ఆందోళన వ్యక్తం చేశారు.మీరు ఇక్కడకు వచ్చి ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల పై మాట్లాడాలని, ప్రభుత్వ వైఫల్యాల'ను ఎత్తిచూపాలని పిట్రోడాను ఉద్దేశించి ఏర్పరిచారు. కానీ మీరు సోఫాలో కూర్చొని చౌకబారు మాటలు మాట్లాడటం సరైంది కాదని

# కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : రాష్ట్రంలో ఉన్న సవతి తల్లిపై పోరాడాల్సి ఉంది.. నాలుగు ప్రాజెక్టులు రాష్ట్రానికి రావాలంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కాదు. ఎందుకంటే వారు ఢిల్లీ గులామ్‌లు. ఇదే గులాబీ కండువా ఎగిరితే.. పార్లమెంట్‌లో మన గొంతు వినబడుతోంది. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలంటే కేసీఆర్ సైనికులు పార్లమెంటరీలో ఉండాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ అల్వాల్‌లో ఏర్పాటు చేసిన యూత్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అంటే.. ఇన్వర్టర్, జనరేటర్, క్యాండిల్ లైట్, టార్చ్ లైట్, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ బల్బ్ అని కేటీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం కరెంట్ ఉండదు. పార్లమెంట్ ఎన్నికలు రాగానే.. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలని అడుగుతున్నారు. కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీ పెట్టినపుడు తెలంగాణ సాధించుకోవాలంటే పార్లమెంట్‌లో మనం శాసించే పరిస్థితి ఉండాలన్నారు. 17 ఎంపీలను గెలిపించాల'న్నారు. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు కలిసి కేసీఆర్ పార్టీ తెలంగాణాలో 17 సీట్లు గెలిచినా.. ఢిల్లీలో బిల్లు పాస్ కావాలంటే 272 మంది మద్దతు ఉండాలి కదా..? తెలంగాణ ఎలా తెస్తాడు అని హేళన చేశారు. కానీ 2004లో ఐదుగురు ఎంపీలు గెలిచారు. కేసీఆర్ ఢిల్లీకి పోయి 32 పార్టీలకు చెందిన 272 మందిని ఒప్పించి 2014లో కేసీఆర్ తెలంగాణను సాధించారు అని కేటీఆర్ చెప్పారు.కాంగ్రెస్ , బీజేపీ ఎంపీలు.. రాహుల్ గాంధీ, మోదీ చెప్పారు. తెలంగాణ గురించి దమ్మున్న నాయ కులే కొట్లాడుతారు. జూన్ 2వ తేదీ తర్వాత కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేసి తన గుప్పిట్లో పెట్టుకోవలని ఆలోచన చేస్తోంది. కేంద్ర పాలిత ప్రాంతం అయితే.. హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. ఒక్క చిన్న పని కూడా చేసుకునేందుకు అవకాశం ఉండదు. మోరీ, నాలా నిర్మించాలన్నా, రోడ్డు వేయాలన్నా ఢిల్లీకి పోయి అడగాలి. కేంద్ర పాలిత ప్రాంతం ప్రతిపాదనను అడ్డుకోవాలంటే గులాంబీ జెండా పార్లమెంట్‌లో ఎగరాలి. రాగిడి లక్ష్మారెడ్డి గెలవాలని కేటీఆర్ గురించి.

# బీజేపీకి ఓటమి భయం పట్టుకుంది

హైదరాబాద్,ఈ ఎన్నికలు దేశంలో చాలా కీలకంగా ఉన్నాయని సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ఉంటుందా?.. లేదా?, వచ్చే పరిణామాలు తట్టుకుంటాయా?.. లేదా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రయత్నం దేశంలో జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అనేక దారుణాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు ఇచ్చామన్నారు. వాటిపై కనీసం ఎక్‌నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వని పరిస్థితి ఇప్పుడు చూస్తున్నామన్నారు. సీబీఐ, ఈడీ కేవలం రాజకీయ కోణంలోనే పని చేస్తున్నాయని విమర్శించారు.

మోదీ నియంతృత్వ విధానాల వల్ల

స్వాతంత్ర్యం తర్వాత ఇంత నిరుద్యోగం ఎప్పుడూ దేశంలో చూడలేదని ఏచూరి అన్నారు. నేడు ప్రతి కుటుంబం అప్పులు చేసి పోషించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పేదలు మరింత పేదలుగా మారిపోతుండగా, ధనికులు మరింత ధనవంతులుగా పెరుగుతున్నారన్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక బతుకుదెరువు భారం బాగా పడుతుందన్నారు. ఇదంతా మోదీ నియంతృత్వ విధానాలే కారణమని సీపీఎం అభిప్రాయ పడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలపై మోదీవైపు నుంచి స్పందనే లేదని మండిపడ్డారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన సభల్లో కూడా మోదీ ప్రస్తావించలేదన్నారు.

అన్నీ అదానీ, అంబానీ పరమేనా?

వినాశకాలే విపరీత బుద్ధులు అనే సామెత మోదీ విషయంలో అర్థం అవుతోందని ఏచూరి అన్నారు. మోదీ ప్రధాని అయ్యే వరకు అదానీ అనే వ్యక్తి ఎవరో ఎవరికైనా తెలుసా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎయిర్ పోర్టులు, సీ పోర్టులు, పెట్రో కెమికల్ ఇండస్ట్రీ, ఇన్ఫర్మేష్ టెక్నాలజీ అన్నీ అదానీ, అంబానీ పరమేనా అని నిలదీశారు. టెంపోలో క్యాష్ ఇస్తున్నారంటే బ్లాక్ మనీ ఉందనేది అర్థం అయిపోతుందన్నారు. అదానీకి, అంబానీ సంస్థలపై ఈడీ, సీబీఐ ఎందుకు దృష్టి పెట్టడం లేదని నిలదీశారు. పోలరైజేషన్‌ను మరింత విస్తృతం చేసి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఎన్నికల తర్వాత

మొదటి రెండు దఫాలు ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మోదీకి ఓటమి తప్పదని తేలిఎయిందని ఏచూరి అన్నారు. అందుకే ఇప్పుడు హిందూత్వం పేరుతో రామ మందిరాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల సంఘానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా వారు పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో తప్పకుండా పెద్ద మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి పేరుతో పొత్తులతో మోదీ వెళుతున్నారని.. ఇండియా కూటమితో తాము వెళుతున్నామన్నారు. ఈ ఎన్నికలలో ప్రధాన అంశాలు, సమస్యలను మోదీ ప్రస్తావించడం లేదన్నారు. ప్రజల్లో ఉన్న భావాలను రాజకీయంగా మార్చుకుని మతోన్మాదం కోసం మోదీ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

మోదీ ఓటమి భయంతో



తప్పకుండా ఈసారి దేశంలో మార్పు ఖాయం.. ప్రభుత్వం మారడం తథ్యమని ఏచూరి స్పష్టం చేశారు. ఏపీలో తెలుగుదేశం, రీజనల్ పార్టీలకు బీజేపీ పొత్తు వల్ల వారికే నష్టమన్నారు. ఏపీలో 10 అసెంబ్లీ, 6 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని.. అంటే ఏపీలో బీజేపీకి ప్రాధాన్యం లేదని అందరికీ అర్థమవుతోందన్నారు. మోదీ ఓటమి భయంతో ఇలా ప్రతి రాష్ట్రంలో తగ్గి మరీ.. రీజనల్ పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. మోదీ మతోన్మాద రాజకీయాలు అర్థం కావడం వల్లే ప్రజలు వారిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎలక్ట్రోల్ బాండ్లు కూడా మోదీ అవినీతికి నిదర్శనమని ఏచూరి వ్యాఖ్యలు చేశారు. బీజేపీ చెప్పిన సంస్థలు తమ లెక్కల్లో అప్పులు, నష్టాలు చూపించారన్నారు. మరి అటువంటి వారు బీజేపీకీ ఎలక్ట్రోరల్ బాండ్లు ఎలా ఇచ్చారో చెప్పలి కదా అని ప్రశ్నించారు.

అదానీ, అంబానీలు వికసిస్తే సరిపోదు..

పార్టీ ఫండ్ పేరుతో మనీ లాండరింగ్‌ను మోదీనే సమర్థిస్తున్నారని ఏచూరి అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా కుంభకోణాలను మోదీ లీగలైజ్ చేశారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎక్కడ వచ్చిందో.. అక్కడ ప్రజలకు కష్టాలు డబుల్ అయ్యాయని వ్యాఖ్యలు చేశారు. ఆయా రాష్ట్రాల్లో అసలు ఇంజనే వద్దని మోదీని వ్యతిరేకిస్తున్నారని ఎద్దేవా చేశారు. రీజనల్ పార్టీలను విడగొడితేనే.. మోదీ గెలిచే పరిస్థితి లేదని అర్థమైపోయిందన్నారు. వికసిత్ భారత్ అంటే ప్రజల జీవనం వికసించాలన్నారు. కానీ అదానీ, అంబానీలు వికసిస్తే.. దేశం వృద్ధి చెందినట్లు కాదని సెటైర్ వేశారు. ఇండియా కూటమి విజయంలో తమ వంతు పాత్ర పోషిస్తామన్నారు. లౌకిక శక్తులన్నీ కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే నమ్మకం ఉందన్నారు.

జగన్, షర్మిల వివాదంపై వారే స్పందించాలి..

రాజ్యంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కులు కాపాడేందుకు లౌకకి ప్రభుత్వం ఎంతో అవసరం కూడా అని ఏచూరి చెప్పుకొచ్చారు. దేశంలో అనేక ప్రాంతాలు పరిశీలించాక.. ప్రజల్లో ఈ మార్పు వచ్చిందని గుర్తించినట్లు తెలిపారు. ఏపీలో ఉన్న రాజకీయాల్లో కుటుంబపరమైన వివాదాలు కూడా ఉన్నాన్నారు. జగన్, అతని చెల్లి వివాదంపై వారే స్పందించాలని.. తాము కేవలం అంశాల వారీగానే ప్రస్తావిస్తూ ముందుకు వెళతామని సీతారం ఏచూరి స్పష్టం చేశారు.

# బలపరీక్ష నిర్వహించండి.. గవర్నర్‌కు లేఖ రాసిన దుష్యంత్ చౌతాలా



చండీగఢ్: బీజేపీ పాలిత హర్యానాలో రాజకీయ సంక్షోభం (హర్యానా రాజకీయ సంక్షోభం) ముదురుతోంది. సీఎం నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వానికి ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకున్నారు. ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించాలని కోరుతూ జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) చీఫ్ దుష్యంత్ చౌతాలా గురువారం హర్యానా గవర్నర్‌కు లేఖ రాశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వానికి మెజారిటీ లేకపోతే రాష్ట్రపతి పాలన అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాగా, హర్యానాలో బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చడం కోసం కాంగ్రెస్‌కు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ మాజీ మిత్రపక్షమైన దుష్యంత్ చౌతాలా స్పష్టం చేశారు. 'రెండు నెలల కింద ఏర్పడిన ప్రభుత్వం ఇప్పుడు మైనారిటీలో ఉంది. ఎందుకంటే వారికి మద్దతిచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒకరు బీజేపీ నుంచి, మరొకరు స్వతంత్ర ఎమ్మెల్యే రాజీనామా చేశారు. అలాగే బీజేపీకి మద్దతు ఇస్తున్న ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు తమ మద్దతును ఉపసంహరించుకున్నారు. ఈ ప్రభుత్వంపై విశ్వాస తీర్మానం ప్రవేశపెడితే, వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలా? వద్దా? అన్నది కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించుకోవాలి' అని ఆయన అన్నారు.

# 13న దేశవ్యాప్తంగా నాలుగో విడత ఎన్నికలు



న్యూఢిల్లీ,మే9: దేశవ్యాప్తంగా నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు గడువు దగ్గర పడింది. మే13న నాలుగో విడత ఎన్నికలు జరుగగనున్నాయి. ఇందులో ఉభయ తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఎపిలో పార్లమెంటుతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇందుకోసం పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. శనివారం 11వ తేదీ సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలకు 48 గంటల ముందు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఏపీలో పలు జిల్లాల్లో సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయని.. అలాంటి చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎండదెబ్బ తగలకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఈసీ రాజీవకుమార్ సూచించారు. ఈనెల 13 న నాలుగవ దశలో ఎన్నికల జరిగే రాష్ట్రాల అధికారులతో కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజకుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 14 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర పరిశీలకులు, ప్రత్యేక పరిశీలకులు, ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు రాజీవ్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. నాల్గవ దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తదితర 14 రాష్ట్రాలతో పాటు పలు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈనెల 13 న ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. అయితే వీటన్నింటిలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలను ఎంతో సున్నితమైనవిగా ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో ఎన్నికల యంత్రాంగం అంతా ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మే 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ముందు 48 గంటలు ఎంతో కీలకమైనవన్నారు. 24 గంటలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని.. హింసకు ఏ మాత్రం అవకాశం లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. ప్రత్యేకించి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లను ప్రభావితంచేసే నగదు, ఇతర ఉచితాల పంపిణీపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేకించి సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. నాలుగో దశ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అత్యంత సునిశితమైన రాష్ట్రంగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రత్యేకించి కొన్ని జిల్లాలు సమస్యాత్మకంమైనవిగా గుర్తించడమైందని, ముఖ్యంగా ప్రత్యేక పరిశీలకులు ఆయా జిల్లాలో తరచుగా పర్యటిస్తూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఆయా జిల్లాలు, నియోజక వర్గాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తమకు నేరుగా తెలియపర్చాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో తిరిగి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు, వడగాల్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఏమాత్రము ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు అన్ని షామియానాలతో కవర్ అయ్యేలా చూడాలని, ఓటర్లు కూర్చునేందుకు క్యూలైన్లలో బెంచ్?లను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్, ప్రథమ చికిత్స సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఓటు వేయడం సామాజిక బాధ్యత అనే విషయాన్ని ఎస్.ఎం.ఎస్., షోషల్ మీడియా ద్వారా ఓటర్లను చైతన్య పరుస్తూ ఓటింగ్ శాతాన్ని పెద్ద ఎత్తున పెంచాలని ఆదేశించారు.

# 'తెలంగాణలో 10 స్థానాలకు పైగా గెలవబోతున్నాం'..



భువనగిరి:తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు కేంద్ర హోం మంత్రి అమిత్ షా. మూడో సారి నరేంద్ర మోదీని ప్రధానిని చేయాలా వద్దా అని ప్రజలను అడిగారు. బీజేపీ 400 సీట్లు రావాలా వద్దా అని ప్రశ్నించారు. దీనికి బహిరంగ సభా ప్రాంగణం మొత్తం కేరింతలతో మార్మోగిపోయింది. అయితే భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ను భారీ మెజార్టీతో గెలిపించండి అని కోరారు. 2024 ఎన్నికలు రాహుల్ వర్సెస్ మోడీ మధ్య నడుస్తున్నాయన్నారు. కుటుంబ అభివృద్ధి దేశాభివృద్ధి మధ్య నడుస్తున్న ఎన్నికలు ఇవి అని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు రాహుల్ పిల్ల చేష్టల్లాంటి గ్యారెంటీలు, మోదీ కచ్చితమైన గ్యారెంటీల మధ్య జరుగుతున్నాయన్నారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా మోదీ నామస్మరణ వినిపిస్తోందని తెలిపారు. ఇప్పటికే బీజేపీ మూడు విడతల లోక్ సభ ఎన్నికల్లో 200 స్థానాలకు మించి గెలిచిపోయిందని జోస్యం చెప్పారు. ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ కు చురకలు అంటించారు.సీఎం రేవంత్ విను ఈసారి బీజేపీ 10 కంటే ఎక్కువ లోక్ సభ స్థానాలు గెలవబోతున్నాం అని అన్నారు. తెలంగాణలో డబుల డిజిట్ స్థానాల్లో గెలిస్తే దేశంలో 400 స్థానాల్లో గెలిచినట్లే అని చెప్పారు. భువనగిరిలో రాహుల్ గాంధీకి చెందిన వ్యక్తికి టికెట్ ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన హామీలు అమలు కాలేదన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, వరి, గోధుమలకు రూ. 500 బెనస్ ఇస్తామన్నారు. ఇంకా అమలు చేయలేదన్నారు. కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వలేదని విమర్శించారు. 70 ఏళ్లుగా రామమందిర నిర్మాణాన్ని చేపట్టకుండా జాప్యం చేశారని చెప్పారు. గతంలో మోదీ శపథం చేసినట్లు రామమందిర నిర్మాణాన్ని అద్భుతంగా నిర్మించి జాతికి అంకితం చేశారన్నారు. దేశంలో నక్సలిజం, ఉగ్రవాదాన్ని మోదీ సమాప్తం చేశారని కొనియాడారు. టెక్స్ టైల్ రంగంలో మోదీ 8 లక్షల మందికి ఉపాధి కల్పించారన్నారు.

# చంద్రబాబు ఉసరవెల్లి.. మైనార్టీలపై దొంగ ప్రేమ..జగన్

కర్నూలు : చంద్రబాబు రాజకీయం ఊసరవెల్లిలాంటిదని, అది బాగా ముదిరిపోయిన తొండగా మారిందని ఏపీ సీఎం జగన్ ఎద్దేవా చేశారు. కర్నూలులో గురువారం జరిగిన ప్రచార భేరీలో మైనారిటీల రిజర్వేషన్ల అంశంపై స్పందించారు. "చంద్రబాబు ఒకపక్క ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో జత కడతారు. మరోవైపు మైనారిటీలను మోసం చేసేందుకు దొంగ ప్రేమ నటిస్తారు.. ఇంతకన్నా ఊసరవెల్లి రాజకీయాలు ఉంటాయా ?. ఆరు నూరైనా.. నూరు ఆరైనా నాలుగు శాతం రిజర్వేషన్లు ఉండి తీరాల్సిందే. ఇది మీ జగన్ మాట. ఇది వైఎస్సార్ బిడ్డ మాట" అని ఉద్ఘాటించారు. మైనారిటీలకు రిజర్వేషన్లపై మోదీ సమక్షంలో చంద్రబాబు ఇలా మాట్లాడగలగా ?. అసలు మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తామన్నా కూడా ఎందుకు బీజేపీతో కొనసాగుతున్నారు" అని సీఎం నిలదీశారు.

మీ బిడ్డకు కులం, మతం, వర్గం తేలీదు

మీ బిడ్డది మనసున్న ప్రభుత్వం. కులం, మతం, వర్గం చూడకుండా ఏ పార్టీకి ఓటేశారన్నది కూడా చూడకుండా.. కేవలం పేదరికం మాత్రమే చూశాడు. వాళ్ల బతుకుల్ని మార్చడం కోసమే అడుగులు వేశాడు. కానీ, చంద్రబాబు అలా కాదు.. చంద్రబాబుది ఊసరవెల్లి రాజకీయం. ఇక్కడున్న వేల జనాలకే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నప్రజలకూ చెప్పాలి. నాలుగు శాతం రిజర్వేషన్లు కేవలం మతం ప్రాతిపాదికన ఇచ్చింది కాదు. ముస్లింలలోని పటాన్, సయ్యద్, మొగల్స్ లాంటి వాళ్లకు ఇవ్వడం లేదు.. కేవలం వెనుకబాటుతనం ఆధారంగానే ఈ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే" అని జగన్ అన్నారు.

నా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం ముస్లిం..

అన్ని మతాల్లో బీసీలు, ఓసీలు ఉంటారు. మైనారిటీలను వేరుగా చూడడం, వాళ్ల నోటిదాకా వెళ్తున్న కూడును లాగేయడం ఎంత వరకు సబబు ? అని



జగన్ ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ స్వార్థం కోసంవాళ్ల జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గం కాదా?.. అందుకే ఎన్నార్సీ . సీఏఏ విషయంలో ఏ అంశంలో అయినా మైనారిటీల మనోభావాలకు, ఇజ్జత్ ఇమాందార్ కు మద్దతుగా నిలబడతాం. ఆరు నూరైనా ముస్లిం రిజర్వేషన్లు ఉండాల్సిందే అని జగన్ అన్నారు. ఈ ప్రభుత్వంలో మైనారిటీల కోసం షాదీ తోఫా లాంటి పథకాలు మాత్రమే ఇచ్చి ఆగిపోలేదు. ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు, ఐదేళ్లు నా పక్కనే ఒక మైనారిటీ సోదరుడికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వడం, ఏకంగా ఏడుగురికి ఎమ్మెల్యేలుగా అవకాశమిచ్చాం.. ఇలా మైనారిటీలకు సముచిత స్థానం ఇచ్చింది కేవలం ఈ 59 నెలల కాలంలోనే అని చెప్పడానికి గర్వపడుతున్నా. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అని ప్రతీసారి నేను ఎందుకు అంటానంటే.. ఎంతగా వారి మీద ప్రేమ చూపిస్తే వెనకబడిన ఆ వర్గాలకు రాష్ట్రంలో వారికిచ్చే గౌరవం పెరుగుతుంది. వాళ్లలో ఆత్మ స్థైర్యం, ఆత్మ గౌరవం పెరుగుతుంది. అందుకే ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి నేను నా.. నా.. అని చెప్తాను" అని జగన్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

**శుక్రవారం 10-05-2024**

## ప్రజలకు ఉపశమనం.. రైతులకు శాపం !

తీక్షణమైన ఎండలతో అల్లాడిపోయిన జనాలకు ఉపశమనం కలిగింది. భానుడి ఉగ్రరూపంతో డస్సిన ప్రాణాలకు సత్తువ వచ్చింది. పోయినా ప్రాణాలు వచ్చాయన్న సంతోషం కలిగింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆరుగాలం కష్టపడే రైతన్నలు మాత్రం కుప్పకూలిపోయారు. అక్కడక్కడా పంటలు కోసి అమ్మకానికి సిద్దంగా పెట్టుకున్న పంటలన్నీ వర్షార్పణం అయ్యాయి. వీరికి ఎండలను మించిన బాధ ఇప్పుడు చుట్టుకుంది. అకాల వర్షాలు ఉంటాయని గత వారం రోజుల ముందే హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఒకరోజు ముందు కూడా హెచ్చరించింది. అయినా ధాన్యం కాపాడడంలో చర్చు తీసుకోవడంలో అధికారులు విఫలం అయ్యారు. ప్రధానంగా మార్కెట్ యార్డులకు తీసుకుని వచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, రైతులకు డబ్బులు చెల్లించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇది మార్కెటింగ్ అధికారుల వైఫల్యంగా చూడాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది కనిపించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మొత్తం ఏడుగురు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో రైతులు చెమటోడ్చి తెచ్చిన ధాన్య వర్షార్పణం అయ్యింది. ఇలాంటి వారిని గుర్తించి వెంటనే సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇకపోతే పంట కోతకు వచ్చిన దశలో కొట్టుకు పోయిన వారి బాధ మరోటి. కొద్ది రోజుల్లో పంటను కోద్దామని అనుకున్న సమయంలో అకాల వర్షం బాగా దెబ్బతీసింది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో అన్నదాతకు అపారనష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, నింపిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పండ్లు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. ఈదురుగాలులకు పలుచోట్ల ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల పిడుగులు పడటంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎపిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. రహదారులపై భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకుగురయ్యారు. సిద్దిపేట జిల్లా రాయపోల్, మిరుదొడ్డి, కుకునూరుపల్లి, కొండపాక, గజ్వేల్ మండలాల్లో మంగళవారం కురిసిన వానకు ధాన్యం తడిసింది. సిద్దిపేట మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం వర్షానికి కొట్టుకు పోయింది. చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బలమైన ఈదురుగా లులకు విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. పిట్టలగూడెంలో గాలివానకు రేకుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. చేర్యాల మండలంలోని వీరన్నపేటలో రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో మామిడి కాయలు రాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పర్ణశాలలో ఈదురు గాలులకు పలు షాపులు, ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయి పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల చెట్లు కూలగా, విద్యుత్తు స్తంభాలు విరిగాయి. గణపురం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు, ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట, వెంకటాపూర్, వెంకటాపురం మండలాల్లో ధాన్యం రాశులు తడిశాయి. ఖానాపురం, ఆత్మకూరు, చెన్నారావుపేట, వర్ధన్నపేట మండలాల్లో ఈదురుగాలులకు పలువురి ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో మామిడి కాయలు రాలడం, కూరగాయలు, పండ్ల తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. చొప్పదండి, గంగాధరలోని మార్కెట్‌లోనూ ధాన్యం తడిసింది. సీతారాంపూర్‌లో విద్యుత్తు స్తంభాలు నేలకూలా యి. లంబాడి పల్లె గాగిరెడ్డిపల్లి రహదారి మధ్య చెట్టు విరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిపోగా, పలువురి ధాన్యం నీటిలో కొట్టుకపోయింది. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధర్మారం, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిముద్దయి ంది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం తడిసి ముద్దయింది. మక్కపంట నేలవాలింది. గాలికి మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. బొప్పాయి చెట్లు నెలకొరిగాయి. రంగారెడ్డి జిల్లా జోగిపేట వ్యవసాయ మార్కెట్‌తోపాటు చింతకుంట కొనుగోలు కేంద్రాలు, రంసాన్‌పల్లి, దానంపల్లి, మాసన్‌పల్లి, ఎర్రారం శివారుల్లో రైతులు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. హత్నూర, మాధుర గ్రామాల్లో ధాన్యం బస్తాలు తడిశాయి. పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులో పిడుగుపాటుకు 48 గొర్రెలు మృతి చెందాయి. ఈ నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది. ఎన్నికల పర్యటనల్లో బిజీగా ఉన్నప్పటికి ముఖ్యమంత్రులు వెంటనే సర్వే నిర్వహించాల్సి ఉంది. నష్టోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలి. అప్పుడే వారిలో భరోసా వస్తుంది. ఇకముందు వర్షాల హెచ్చరికలు రాగానే క్షేత్రస్థాయిలో రైతులను అప్రమత్తం చేసి పంటలను కాపాడాలి. అలాంటి వ్య వస్థను బలోపేతం చేయాలి. అప్పుడు పంటనష్టాన్ని తగ్గించుకోగలం అని గుర్తించాలి.

## బీఆరెస్‌లో ఎమ్మెల్సీ చిచ్చు.. నామినేషన్‌కు నేతలు దూరం

హైదరాబాద్, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న వేళ వచ్చిపడిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీఆరెఎస్ పార్టీలో పెద్ద చిచ్చు పెట్టింది. పైకి గంభీరంగా వ్యవహరిస్తున్నప్పటికీ అంతర్గతంగా అధిష్టాన నిర్ణయం పై రగిలిపోతున్నారు. ఎంపిక చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పార్టీ నాయకులెవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తి, తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాకేష్ రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ జిల్లా పై పల్లా ఆధిపత్యమేంటంటూ ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆరెస్ నాయకులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. వీరికి నచ్చచెప్పేందుకు పల్లా అధిష్టాన నిర్ణయమని చెబుతున్నట్లు విమర్శిస్తున్నారు.

రాకేష్ రెడ్డిని నిర్ణయించిన బీఆరెస్

నల్గొండ,- వరంగల్,- ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆరెఎస్ అభ్యర్థిగా ఏనుగు రాకేష్ రెడ్డిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం ప్రకటించారు. ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజీనామాతో ఈ స్థానానికి ఉప ఎన్నికలొచ్చాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఖాళీ అయిన ఈ స్థానానికి పార్లమెంటు ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ నిర్ణయించింది. బీఆరెఎస్ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం వరంగల్ జిల్లాకు చెందిన వాసుదేవరెడ్డి, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ మరికొందరు ఉద్యమ నాయకులు ప్రయత్నించినప్పటికీ రాకేష్ రెడ్డి వైపు కేసీఆర్ మొగ్గు చూపారు.

రాకేష్ రెడ్డి బీజేపీ నుంచి బీఆరెస్ లోకి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాకేష్ రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆరెఎస్ లో చేరారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న రాకేష్ రెడ్డి ఆ పార్టీ నుంచి వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో బీజేపీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీఆరెఎస్ లో చేరారు. ఆ పార్టీలో చేరిన కొద్ది కాలానికే ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమ నాయకులను కాదని ఇటీవల కాలంలో బిజెపి నుంచి చేరిన వ్యక్తికి అవకాశం కల్పించడం పట్ల అసంతృప్తి వ్యక్తం అవుతోంది. మూడు జిల్లాల పరిధిలో బీఆరెఎస్ నాయకత్వానికి అర్హులైన అభ్యర్థి లభించలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

రాకేష్ రెడ్డి అభ్యర్థిత్వం పై ఆగ్రహం

రాకేష్ రెడ్డికి టికెట్ కేటాయించడం తమకు ఇష్టం లేదని వరంగల్ జిల్లా నాయకులు చెబుతున్నారు. అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ కారణంగానే మంగళవారం రాకేష్ రెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఒక్క మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మినహా మిగిలిన నాయకులెవరు హాజరు కాలేదు. నామినేషన్ ఘట్టం ముగిసినప్పటికీ రానున్న రోజుల్లో రాకేష్ రెడ్డి ప్రచారానికి దూరంగా ఉండాలని గట్టి నిర్ణయంతో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా నాయకులందరినీ కాదని ఎమ్మెల్యే పల్లా ఒక్కరే రాకేష్ రెడ్డిని ఎలా గెలిపిస్తాడో చూద్దామనే పంతంతో ఉన్నారు. తనకు అధిష్టానం దగ్గర ఉన్నందున అసంతృప్త నాయకులకు నచ్చచెప్పించడం పెద్ద పని కాదనే విశ్వాసంతో ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలువురు నాయకులతో మాట్లాడినప్పటికీ ఈ నిర్ణయాన్ని అంగీకరించలేదని తెలుస్తోంది.

వినయ్ భాస్కర్ అసంతృప్తి?

మాజీ చీఫ్ విప్ వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నట్లు సమాచారం. ఈసారి ఎన్నికల్లో తన అనుచరుడిగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడు, విద్యాసంస్థల అధిపతి మాజీ కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ కు టికెట్ ఇప్పించాలని భావించినట్లు సమాచారం. ఆయనకు కుడా చైర్మన్ గా అవకాశం కల్పించినప్పటికీ స్వల్పకాలం మాత్రమే ఛాన్సు దక్కింది. కానీ వినయ్ కి తెలియకుండానే పల్లా చక్రం తిప్పి రాజేష్ రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నట్లు చర్చ సాగుతోంది. ఈ పరిణామంతో



పార్లమెంటు ఎన్నికలకు కూడా ఒక వర్గం దూరంగా ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో అధికారం కోల్పోయి ఓటమిపాలైనప్పటికీ కూడా అధిష్టానం గుణపాఠం తీసుకోకుండా పనిచేసే తమలాంటి నేతల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా ఏకపక్ష పోకడలతో వ్యవహరించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నే రాజేష్ రెడ్డి బిజెపి నుంచి బీఆరెఎస్ లో చేరడాన్ని వినయ్ వ్యతిరేకించారు. తనకు సంబంధం లేకుండానే పల్లా ఆధ్వర్యంలో ఆయనను బీఆరెఎస్ లో చేర్చుకున్నారు. ఎన్నికల సమయం అయినందున వినయ్ అంతర్గతంగా తన అభిప్రాయాన్ని చెప్పి పట్టించుకోలేదు. ఆ తరువాత కూడా తన మాట చెల్లుబాటు కాకుండా పల్లా వ్యవహరించడం వినయ్ కి రుచించలేదు. వినయ్ కి కూడా అధిష్టానం లోని ముఖ్య నేత కేటీఆర్ తో అత్యంత సాన్నిహిత్యం ఉంది. కేసీఆర్ కుటుంబ సభ్యునిగా పేరుంది. హరీష్ రావు లతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన మాట కు విలువ లేకపోవడం పట్ల నారాజైనట్లు సమాచారం. ఈ పరిణామం ఏమలుపు తీసుకుంటుందో అనే చర్చ బీఆరెఎస్ వర్గాల్లో సాగుతోంది.

చిచ్చుపెట్టిన అభ్యర్థి ఎంపిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్ది ఎంపీక బీఆరెఎస్ లో చిచ్చు పెట్టింది. ఇటీవల పార్టీలో చేరిన రాకేష్ రెడ్డికి కేటాయించి, సుదీర్ఘకాలం పార్టీలో ఉంటున్న మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ కి టికెట్ దక్కక పోవడం తో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. బీసీ సంఘాలు బీఆరెఎస్ నిర్ణయం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వినయ్ సన్నిహితుడిగా ఉన్న సుందర్ రాజ్ ఎమ్మెల్సీ టికెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయనను కాదని వినయ్ వ్యతిరేకి రాకేష్ రెడ్డి వైపు మొగ్గు చూపడం ఇప్పుడు ఆ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వినయ్ భాస్కర్ పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ బీజేపీలో చేరడంతో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ సమయంలో తన అనుచరున్ని కాదని తన వ్యతిరేకికి టికెట్ కేటాయించడం పట్ల పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్సీగా బరిలో నిలవాలని సుందర్ రాజ్ పై అనుచరులు, మద్దతు దారులు ఒత్తిడి చేస్తున్నారు. ఆయన మాత్రం దీనిపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తీవ్ర అసంతృప్తికి లోనైన సుందర్ రాజ్ ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుజ్జగిస్తున్నట్లు సమాచారం.

అగ్ర కులాలకే అవకాశం

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయంలో తొలి నుంచి ఎస్సీ, ఎస్టీ బీసీలను కాదని ఇప్పటివరకు బీఆరెఎస్ రెడ్డి సామాజిక వర్గం లేదా అగ్రకులాల అభ్యర్థి వైపే మొగ్గుచూపుడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కపిలవాయి దిలీప్ కుమార్ కు ఆ తర్వాత వరదారెడ్డికి ఆ తదుపరి పల్లా రాజేశ్వర్ రెడ్డి కి అవకాశం కల్పించారు తప్ప కింది కులాలకు ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శలున్నాయి. మరోసారి రెడ్డి సామాజిక వర్గం వైపే మొగ్గుచూపుడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో ఓటమిపాలైన తీన్మార్ మల్లన్నకే అవకాశం కల్పించింది. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ప్రకటించింది. ప్రేమేందర్ రెడ్డి సైతం గతంలో ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆయనకే మరోసారి పార్టీ అవకాశం కల్పించింది. కాంగ్రెస్ బీసీకి ఛాన్సు ఇవ్వగా, బీఆరెస్, బీజేపీలు రెడ్డి సామాజిక వర్గం అభ్యర్ధులను ప్రకటించింది.

## వైద్య సంరక్షణ చట్టం సవరణతో ఆదివాసీలకు వినాశనం



అనకాపల్లి : గిరిజన ప్రాంతంలోని వనరులకు అప్పగించేందుకు సంరక్షణ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం సవరించిందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అన్నారు. బడా కార్పొరేటర్లు దోచుకోవడానికి వాసీ హక్కులను దెబ్బతీస్తున్న బిజెపి, దానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న టిడిపి, వైసిపిని ఓడించి, ఆదివాసీ హక్కులను కాపాడే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆదివాసులకు ఉన్న ప్రత్యేక గ్రామసభ హక్కును తొలగించి, బాక్సైట్, హైడల్ పవర్ ప్రాజెక్టుల పేరుతో దాని వంటి వారు ప్రవేశానికి అవకాశం కల్పించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా వేదిక అభ్యర్థులకు మద్దతుగా ఐటిడిఎ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, చట్టబద్ధమైన గ్రామ సభ హక్కును మోడీ ప్రభుత్వం గిరిజనులకు లేకుండా చేసింది. అభివద్ధి పేరుతో భూములు లాక్కోవాలని చూస్తున్నారని వివరించారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, సంపదను అందించడానికి సర్వనాశనం చేయడానికి గిరిజన గుండెలపై కుంపటిలా కూర్చోవాలని చూస్తున్నారని అన్నారు. కోర్టు తీర్పును అడ్డం పెట్టుకొని జీఓ 3 ప్రకారం వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలును అడ్డుకుంది. ఉద్యోగాల కల్పనలో గిరిజనులకు రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రయిల్‌లోనే మోడీ ఆదివాసీ హక్కులపై దాడి, సినిమా చూపిస్తామంటుంటే తమ బతుకులు ఏమవుతాయోనని గిరిజనులు భయపడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మేస్తుంటే, గిరిజనులకు రిజర్వేషన్లు వర్తించవని, ఉద్యోగ అవకాశాలు ఉండవని, ప్రభుత్వ ఉద్యోగాలను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చుకుంటే ఆదివాసీ యువత భవిష్యత్ ఏంటని ప్రశ్నించారు. ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు నిధులు విడుదల చేయడం. మణిపూర్‌లో డబుల్ ఇంజన్ సర్కారు క్రిస్టియన్ గిరిజనులపై ఏడాదిగా దాడులకు దిగుతోంది. ఆదివాసీ హక్కులపై చేస్తున్న బిజెపి దాడులను ప్రశ్నించకుండా, కేసుల భయంతో జైల్లో పెడతారన్న భయంతో వైసిపి, టిడిపి మౌనంగా ఉంది. ఈ సభలో ఇండియా వేదిక బలపర్చిన అరకు లోక్ సభ సిపిఎం అభ్యర్థి పి అప్పలనర్స, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు వీరన్న పడాల్, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు గంగరాజు నిర్వహించారు.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా సాగిన పాలన

నిజామాబాద్,రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పునరంకితం అవుతామని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డిఅన్నారు. ఇచ్చిన హామీలన్నీ సీఎం కేసీఆర్ నెరవేర్చారని, అందుకే ప్రజల్లో కెసిఆర్ పట్ల ఆదరణ తగ్గలేదని అన్నారు. ఈ తొమ్మిళ్ళ కాలంలో రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేశామని అన్నారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దరిచేర్చామని ఆయన చెప్పారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నారని చెప్పారు. పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం ద్వారా 30 ఏళ్ళప్రజల ఆకాంక్షలు నెరవేరాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళల వికాసమే లక్ష్యంగా పనిచేశామని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ కిట్స్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు మహిళా వికాసానికి దోహదం చేసాయని చెప్పారు. గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించామన్నారు. బీళ్లుగా మారిన వేలాది ఎకరాలను మిషన్ కాకతీయ పంట పొలాలుగా మార్చి సస్యశ్యామలం చేసామని తెలిపారు. తద్వారా తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చామని చెప్పారు. అయితే ఈ పథకాలు ఇప్పుడు పడావు పడ్డాయన్నారు. కాంగ్రెస్ విచారణలు, ఎంక్వైరీలతో కాలక్షేపం చేస్తూ పనులను పక్కన పెట్టిందన్నారు. అందుకు మళ్లీ సాగు,తాగునీటి సమస్యలు ముందరికి వచ్చాన్నారు. అలాగే కరెంట్ కోతలు విపరీతంగా ఉంటున్నాయని అన్నారు. ఇవన్నీ పోవాలంటే బిఆర్ఎస్ బలంగా ఉండాలన్నారు. నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు.

## జూన్ 4న మళ్లీ మీ బిడ్డ గెలుస్తాడు...

శ్రీకాకుళం,సాలూరులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విస్తరన పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో కొత్తగా 4 మెడికల్ కాలేజీలు కడుతున్నామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో సెల్‌ఫోన్ కనెక్టవిటీ పెంచామని అన్నారు. ఎన్నిక ప్రచారంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో సీఎం జగన్ భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..జూన్ 4న విశాఖ నుంచే ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పారు. మూడు జిల్లాలను ఆరు జిల్లాలను చేశామన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేస్తామని పేర్కొన్నారు. ఉద్దాన సమస్యను పరిష్కరించామని, కిడ్నీ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంక్షేమ పథకాలు అందకుండా చంద్రబాబు కుట్రలు చేశాడని సీఎం జగన్ మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు ఢిల్లీ వాళ్లతో కలిశాడని దుయ్యబట్టారు. బటన్లు నొక్కిన సొమ్ము పేదలకు అందకుండా కుట్రలు చేశాడని ధ్వజమెత్తారు. ఈ పథకాలకు బడ్జెట్‌లో ఆమోదం కూడా తెలిపామని తెలిపారు. పథకాలు ఆపగలరు కానీ.. మా విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. 14 ఏండ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఏ పేదకైనా మంచి చేశారా? అని ఏపీ సీఎం జగన్ ప్రశ్నించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన బాబు పేరు చెబితే ఒక్కటంటే ఒక్క స్కీమైనా గుర్తొస్తుందా అని అడిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోరుకొండలో నిర్వహించిన రోడ్ షోలో ఏపీ సీఎం జగన్.. టీడీపీ అధినేత చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు రకరకాల వాగ్దానాలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడంతో 2019లో రైతన్నలు, మహిళలు, నిరుద్యోగులు, సామాజిక వర్గాలు, పల్లె, పట్టణ ప్రజలు అంతా కలిసి సైకిల్‌ను ఏ ముక్కకు ఆ ముక్క విరిచి పక్కన పడేశారని విమర్శించారు. 2019 ఎన్నికల తర్వాత తుప్పుబట్టిన సైకిల్‌కు రిపేర్ చేయాలని చంద్రబాబు చాలా కష్టపడుతున్నారని జగన్ విమర్శించారు. ఆ రిపేర్ చేయించడంలో భాగంగా ముందుగా ఎర్ర చొక్కాల దగ్గరికి వెళ్లాడని తెలిపారు. ఎర్ర చొక్కాల దగ్గరికి వెళ్లినప్పుడు అక్కడ ఫలితం రాలేదని.. దీంతో దత్తపుత్రుడిని పిలుచుకున్నాడని అన్నారు. ఆ దత్తపుత్రుడేమో సైకిల్ మొత్తాన్ని చూసి.. నేను క్యారేజి మీద మాత్రమే ఎక్కుతాను.. టీ గ్లాస్ మాత్రమే పట్టుకుని తాగుతానని అన్నాడని విమర్శించారు. మిగతావి తన వల్ల కాదని దత్తపుత్రుడు చెప్పాడని అన్నారు. ఆ తర్వాత వదినమ్మను ఢిల్లీకి పంపించాడని.. అక్కడి మెకానిక్‌లను ఇక్కడికి దింపాడని అన్నారు. ' సైకిల్‌ను ఒక షేప్‌లోకి తీసుకురమ్మని ఆ మెకానిక్‌లను బాబు అడిగాడు. ఆ మెకానిక్‌లు వచ్చి తుప్పుబట్టిన సైకిల్‌ను చూశారు.. ఆ సైకిల్‌కు హ్యాండిల్ లేదు.. సీటు లేదు.. పెడల్స్ లేవు.. చక్రాలు లేవు.. ట్యూబ్‌లు లేవు.. మధ్యలో ఫ్రేమ్ కూడా లేవు.. ఇంత తుప్పుబట్టిన సైకిల్‌ను ఎలా బాగు చేస్తామని చంద్రబాబును అడిగారు. అప్పుడు పిచ్చి చూపులు చూసి.. ఇదొక్కటే మిగిలిందని బెల్‌ను చూపించి.. బెల్ కొట్టడం మొదలుపెట్టాడు.' అని విమర్శించారు. ఆ బెల్ పేరే.. అబద్దాల మేనిఫెస్టో అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చేదాకా అబద్దాలు, మోసాలు చేస్తూనే ఉంటారని విమర్శించారు. అధికారం దక్కితే చంద్రబాబు చేసే మాయలు, మోసాలు ఎలా ఉంటాయో.. 2014 మేనిఫెస్టో చూస్తే తెలుస్తుందని జగన్ అన్నారు. ఇదే ముగ్గురితో అప్పుడు కూటమిగా ఏర్పడి.. ఒక మేనిఫెస్టోను ఇంటింటికీ పంపించాడని గుర్తు చేశారు. ఆ మేనిఫెస్టోతో గెలిచిన తర్వాత.. అందులో చెప్పిన ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. తమ పాలనలో 59 నెలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. అక్కచెల్లెమ్మలకు నేరుగా రూ. 2లక్షల 70 వేల కోట్లు అందించాం. 2 లక్షల 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించాం. మేనిఫెస్టోని 99 శాతం హామీలను నెరవేర్చాం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చాం. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సబ్జెక్ట్ టీచర్లు. ప్రభుత్వ స్కూళ్లలో 6వ తరగతి నుంచే డిజిటల్ బోధన. బడులు తెరిచే నాటికే విద్యాకానుక, గోరుముద్ద. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా మార్పులు. విద్యారంగంలో మేం చేసిన అభివృద్ధి బాబు హయాంలో జరిగిందా అని ప్రశ్నించారు. ఆసరా, సున్నావడ్డీ,చేయూత.కాపు నేస్తం, ఈబీసీ నేస్తం. అలాగే 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చాం. అందులో 22 లక్షల ఇళ్లు కడుతున్నాం. గతంలో ఎప్పుడైనా ఇంత మంచి జరిగిందా? అవ్వాతాతలకు ఇంటి వద్దకే రూ. 3 వేల పెన్షన్. ఇంటి వద్దకే పౌరసేవలు, సంక్షేమ పథకాలు. సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు తోడుగా నిలిచాం. గతంలో రైతన్నకు ఇంత మంచి జరిగిందా?. పెట్టుబడి సాయంతో రైతన్నకు తోడుగా ఉన్నాం. రైతులకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గ్రామస్థాయిలోనే రైతులను చేయి పట్టుకొని నడిపించే ఆర్‌బీకే వ్యవస్థ. స్వయం ఉపాధికి అండగా వాహనమిత్ర, నేతన్న నేస్తం,మత్స్యకార భరోసా. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మార్చాం. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షల వరకు పెంచాం. పేషెంట్ విశ్రాంతి సమయంలోనూ ఆర్థిక సాయం అందించాం. ఆరోగ్య ఆసరా, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్. విలేజ్ క్లినిక్‌ల ద్వారా పేదవాడిని ఆదుకున్నాం అని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడుగులు వేశాం. మూడు జిల్లాలను ఆరు జిల్లాలను చేశాం. ఎగ్జిక్యూటివ్‌క్యాపిటల్‌గా విశాఖనుఉద్దాన సమస్యను పరిష్కరించాం. కిడ్నీ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. జూన్ 4న మీ బిడ్డ అధికారంలోకి వస్తాడు. మీ బిడ్డ అధికారంలో వెంటనే మళ్లీ మొత్తం అందస్తాం. చంద్రబాబు దగ్గర ప్రజల నుంచి దోచేసిన సొమ్ము చాలా ఉంది. దోచేసిన సొమ్ముతో చంద్రబాబు ఓటర్లను ప్రలోభ పెడతాడు బాబు డబ్బులిస్తే తీసుకోండి.. కానీ ఓటేసే ముందు ఆలోచించండి. ఎవరి వల్ల మీ కుటుంబానికి మంచి జరిగిందో ఆలోచించండి. మీరు వేసే ఓటుతో ఢిల్లీ పీఠం కదలాలి. ఓటు అనే అస్త్రంతో బాబుకు గట్టిగా బుద్ధి చెప్పాలని జగన్ పిలుపునిచ్చారు.

### టిడిపి కార్యకర్తలపై వైకాపా దాడి

పల్నాడు,పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గాలు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. హోమ్ ఓటింగ్ విషయంలో వివాదం చెలరేగింది. టీడీపీ సానుభూతి పరుడైన బషయ్య ఇంటికి ఓటు కోసం వైసీపీ వర్గాలు వెళ్లాయి. అదే సమయంలో టీడీపీ వర్గాలు సైతం అక్కడకు వచ్చాయి. టీడీపీ కార్యకర్తల ఇళ్లపై వైసీపీ వర్గాలు రాళ్లు రువ్వాయి. ఇదే సమయంలో మీడియాపై సైతం వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు అక్కడే ఉన్నా కూడా ప్రేక్షక పాత్ర వహించడం గమనార్హం. వైసీపీ కార్యకర్తల దాడిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వైసీపీ నేతల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇష్టానుసారంగా దాడులకు పాల్పడుతున్నారు. నయానో భయానో టీడీపీ కార్యకర్తలను దారిలోకి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల టీడీపీ కార్యకర్తలపై దాడులకు వైసీపీ కార్యకర్తలు తెగబడుతున్నారు. ఇదంతా వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్భలంతోనే జరుగుతోందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అల్లూరి స్ఫూర్తితో గిరిజనులకు అండ

శ్రీకాకుళం,తెలుగుజాతి స్ఫూర్తి ప్రదాత, ఆదివాసీల ఆరాధ్య నేత అల్లూరి సీతారామరాజు అమరుడై వందేళ్లు పూర్తి చేసుకుని వందా ఒకటో సంవత్సరంలో అడుగుపెట్టబోతోంది. 1924 మే7న అల్లూరి సీతారామరాజును చెట్టుకు కట్టి కాల్చి చంపారు. ఆనాటికీ నేటికీ గిరిజనుల జీవితాల్లో ఎలాంటిమార్పూ చోటుచేసుకోలేదు. ఆనాటి దోపిడీ వ్యవహారం ఇంకాకొనసాగుతోంది. ఆదివాసుల హక్కులను స్వతంత్ర భారతంలోనూ కాలరాస్తున్నారు. భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు కొన్ని రక్షణలు, హక్కులు కల్పిస్తూ 5,6 షెడ్యూళ్లలో పొందుపర్చారు. షెడ్యూల్ ప్రాంతంలో ఎన్ని చట్టాలు వచ్చినా అవేవీ అమలు కావడం లేదు. 1/70చట్టం ఉన్నప్పటికీ ఉత్తరాంధ్ర–గోదావరి మన్యంలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం తమైపోయాయి. వీటిని గిరిజనేతర భూస్వాములు నేటికీ చట్టవిరుద్ధంగా అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ పాలన లో కేంద్రప్రభుత్వం అటవీ రక్షణ చట్టం తీసుకు వచ్చింది. ఈ చట్టం ఆదివాసీలకు అటవీ హక్కులు కల్పించినప్పటికీ, వారి సాగు భూమికి,పోడు భూమికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తూ వచ్చాయి. పోడు భూముల హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపిస్తున్నారు. అటవీ ఉ త్పత్తులను గిట్టుబాటు ధర లేదు. షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు ఉన్నప్పటికీ మైదాన ప్రాంత కాంట్రాక్టర్లు, పాలకపక్ష నేతలు యథేచ్ఛగా గనుల తవ్వి వందల కోట్లు ఆర్జిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రధానంగా ఆదివాసీ కుటుంబాలే భూమిని, ఊరును, ఉపాధిని కోల్పోయారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా వారికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వడంలేదు. షెడ్యూల్ ప్రాంతంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు లేవు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ ఉద్యోగాలకు జీవో నెం:3 రక్షణగా ఉండేది. దానిని సుప్రీం కోర్టు కొట్టివేసింది. అనేక ఆదివాసీ వ్యతిరేక చర్యలు చేపట్టి ఆదివాసీల అస్థిత్వానికే ప్రమాదం తెచ్చిపెడుతోంది. ఆదివాసీ చట్టాలను సవరించి, రద్దుపర్చి తీవ్ర అన్యాయం చేస్తోంది. తెగల మధ్య అనైక్యతను పెంచే కుట్రలు చేస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలేదు. షెడ్యూల్ ప్రాంత చట్టాలను అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో పంచాయతీలకు పీసా చట్టం ఉన్నప్పటికీ అమలు చేయడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాములు, వ్యాపారులు, కాంట్రాక్టర్ల కొమ్ముకాస్తున్నాయి.ఆదివాసీ లకు అన్యాయం చేస్తు న్నారు. నాడు బ్రిటిష్ ప్రభుత్వం ఆదివాసీలతో రోడ్లు, ఘాట్ రోడ్లు వేయించేది. కూలీ చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించేవారు. బ్రిటిష్ అటవీ విధానాన్ని కఠినంగా అమలు జరిపి ఆదివాసీ ల సాంప్రదాయక పోడు వ్యవసాయాన్ని నిషేధించారు. అటవీ ఉత్పత్తులను సేకరించడం పై ఆంక్షలు విధించారు. బ్రిటిష్ రెవెన్యూ చట్టాలు ఆదివాసీల స్వంత భూములు కోల్పోయే పరిస్థితి తీసుకు వచ్చింది. విశాఖ–గోదావరి మన్యంలో తమ జీవనానికి ఏకైక ఆధారమైన భూములను ఆదివాసీలు పెద్ద ఎత్తున కోల్పోయారు. దీనికి తోడు మైదాన ప్రాంతం నుండి వచ్చిన వ్యాపారులు, అటవీ కాంట్రాక్టర్లు యథేచ్ఛగా దోపిడీ సాగించడం, గిరిజనేతరులు పెద్ద ఎత్తున భూముల్ని స్వాధీనం చేసుకోవడం ఆదివాసీల సంప్రదాయ జీవన పరిస్థితిని అతలాకుతలం చేసింది. వాటిలో తిరుగుబాటు ఆలోచనలకు కారణమైంది. అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో... ఆదివాసీ మౌలిక సమస్యల పరిష్కారం కోసం, బ్రిటిష్ వలస పాలన అంతంకోసం 1922 ఆగస్టు నుండి 1924 జూన్ వరకు విశాఖ,గోదావరి మన్య ప్రాంతంలో మహోద్ధృత పోరాటం సాగింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన ఈ పోరు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మన్యం విప్లవంగా ప్రాచుర్యం పొందింది. మన్య విప్లవం ప్రారంభమై వంద సంవత్సరాలవుతోంది. ఆ పోరాట లక్ష్యాలు నేటికీ నెరవేరలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి దేశానికి స్వాతంత్య్రం సాధించి 75 ఏళ్లు అయ్యింది. కానీ దోపిడీ, పెత్తనం పోలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరల పాలన వచ్చినా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు. దేశ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టే విధానాలతో దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. అల్లూరి మన్య విప్లవ పోరాట లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నేడు మరింతగా ముందుకు తీసుకుపోవాల్సి ఉంది. అల్లూరి, మన్య పోరాట ఆదివాసీల ఏ మౌలిక సమస్యల పరిష్కారం కోసమైతే పోరాడారో అవి నేటికీ పరిష్కారం కాలేదు. ఆదివాసీ గూడేల్నింటినీ పర్యటించి ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన అల్లూరి మన్యం పోరాటానికి ఆదివాసీలను సమాయత్తం చేయ నారంభించారు. ఆదివాసీ యువకులను ఎంపిక చేసుకొని సాయుధ శిక్షణ ప్రారంభించారు. తాను స్వయంగా విల్లును, తుపాకిని ఉపయోగించడం నేర్పుకున్నాడు.1922 జనవరి నుండి ఆదివాసీలు వివిధ రూపాలలో తమ ధిక్కారాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి చూపించనారంభించారు. అలా మన్య తిరుగుబాటు మొదలైంది. అల్లూరి నాయకత్వ శిక్షణలో ఆగష్టు 22న 150 మంది ఆదివాసీ గెరిల్లాలు చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఇదే మన్య పోరాట తొలి ఘటనగా చరిత్రలో నిలిచిపోయింది. వెనువెంటనే కృష్ణదేవి పేట, రాజవొమ్మంగి, దేవీపట్నం పోలీస్ స్టేషన్లను ముట్టడించారు. ఈ పోరాట ఘటనల అనంతరం అన్నవరం పర్యటనకు వచ్చిన అల్లూరికి ప్రజలు జేజేలు పలికారు.మూడు సంవత్సరాల పాటు విశాఖ మన్యంలో ప్రారంభమైన పోరాటం గోదావరి మన్యం వరకూ పెద్దఎత్తున సాగింది. ఈ పోరాటాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తీవ్ర దమనకాండతో అణచివేసింది. ఈ పోరాటం ఆనాడు అణచివేయబడినా పోరాట లక్ష్యాల సాధన కోసం ఆదివాసీలు అప్పటి నుండి ఈనాటి వరకూ అనేక ఉద్యమాలు సాగిస్తూనే ఉన్నారు. నేటికీ పోడు పట్టాల కోసం ఉభయతెలుగ రాష్ట్రాల్లో గిరిజనులు పోరాడుతున్నా వారికి న్యాయం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఇప్పటికైనా అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని సమస్యలను తీర్చాలి.

## మన్యం ఉద్యమ నేత అల్లూరి

విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు1897 జులై 4న విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామంలో తన తల్లి పుట్టింట పుట్టారు. తండ్రి స్వగ్రామం ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం పట్టణానికి 10 కి.మీ. దూరంలో వున్న మోగల్లు గ్రామం. గోదావరి జలాలతో సస్యశ్యామలమైన ప్రాంతమిది. హైస్కూల్ లో చదువుతున్నప్పుడే నిరంతరం ఏదో ఆలోచనలు చేస్తున్న విలక్షణమైన విద్యార్థిగా ఉండే వారు. ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, ఆయన సహాధ్యాయి మద్దూరి అన్నపూర్ణయ్య...అల్లూరి ఆలోచనలను కొన్నింటిని తన గ్రంథంలో పేర్కొన్నారు. అల్లూరి హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే లోకోద్ధరణకు ఉపకరించే విద్యయే నిజమైన విద్య అన్నారని అన్నపూర్ణయ్య రాశారు. అర్హతలు, అవకాశాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాలు, డబ్బు సంపాదన గురించి ఏమాత్రం ఆలోచించలేదు. ఏదో చేయాలనే నిరంతర తపన పడేవారు. ఈ ఆలోచనలను ఆచరణలో పెట్టడం కోసమే 1913–17 మధ్య తుని సమీప ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతంలో సంచారం చేశారు. ఆదివాసీ జీవితాలను తొలిసారిగా పరిశీలించారు. 1916 ఏప్రిల్ 26న దేశ యాత్ర ప్రారంభించి ఉత్తర భారత దేశంలో విస్తృతంగా పర్యటించారు. తొలితరం కాంగ్రెస్ ఉద్యమ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీని కలకత్తాలో కలిసి చర్చించారు. స్వాతంత్య్ర సమర యోధుడు పృథ్వీసింగ్‌తో పరిచయం చేసుకున్నారు. చిట్టగాంగ్ విప్లవ వీరులతో పరిచయాలు చేసుకొని ఆ పోరాట అనుభవాలను అవగాహన చేసుకున్నారు. ఉత్తరదేశ యాత్రలు ముగించుకొని 1917 జులై 17న విశాఖ మన్యం కృష్ణదేవిపేటకు చేరుకున్నారు.

# ‘ఎన్డీఏ’కు ‘ఇండియా’ సవాల్!

న్యూఢిల్లీ,మూడోసారి అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి తనకు తిరుగులేదని అనుకుంటున్న పలు రాష్ట్రాల్లో ఎదురుగాలి వీస్తున్నదా? బీహార్, మహారాష్ట్రలలో ప్రాంతీయ పార్టీలను కలుపుకొని కాషాయపార్టీకి కాంగ్రెస్ చెక్ పెట్టిందా? మోడీ, షాల మిషన్ సౌత్ ఈసారి బెడిసి కొడుతుందా? 2014, 2019లలో గుజరాత్‌లో క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీకి ఈసారి ఆ ఘనత సాధ్యమేనా? ఉత్తరాదిలో నష్టాన్ని దక్షిణాదిలో పూడ్చుకోవడానికే ప్రధాని పదే పదే ఇక్కడికి పర్యటిస్తున్నారా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తున్నది.మూడో దశలో భాగంగా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 స్థానాలకు పోలింగ్ ముగిసింది. వాస్తవానికి ఈ విడుతలో 94 స్థానాలకు పోలింగ్ జరగాలి. కానీ సూరత్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం, ఆ స్థానంలోని బీజేపీ మినహా మిగిలిన అభ్యర్థులు నామినేషన్ విత్‌డ్రా చేసుకోవడంతో ఆ స్థానం ఏకగ్రీవమైంది. గుజరాత్‌లో 25 స్థానాలకే పోలింగ్ జరిగింది. అక్కడి మొత్తం 26 స్థానాలను 2014, 2019లో బీజేపీనే గెలుచుకున్నది.కానీ ఈసారి అక్కడ రాజ్‌పుత్‌ల నుంచి ఆ పార్టీ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల రాజ్‌పుత్‌లపై చేసిన వ్యతిరేక వ్యాఖ్యలే దీనికి కారణమని అంటున్నారు. ఇది ఎక్కడిదాకా వెళ్లిందంటే ఆ సామాజికవర్గానికి చెందిన మహిళలు ఏకంగా బీజేపీ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో రాజ్‌పుత్‌లు 17 శాతం దాకా ఉంటారు. సౌరాష్ట్రలో వీరి ప్రభావం ఉంటుంది. అందుకే నష్టనివారణ కోసం ప్రధాని ఆ వర్గానికి చెందిన రాజవంశీకులను కలిసి వాళ్లను శాంతపరిచే ప్రయత్నం చేశారని అంటున్నారు.1995 నుంచి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ, గత రెండుసార్లు ఆ రాష్ట్రంలో మొత్తానికి మొత్తం లోక్‌సభ సీట్లు కైవసం చేసుకున్న పార్టీకి ఈసారి కష్టాలు తప్పేలా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గుజరాత్ నమూనాతోనే అధికారంలోకి వచ్చిన బీజేపీ.. మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ) తొలి పది స్థానాల్లోనూ గుజరాత్ లేదన్న కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ వ్యాఖ్యలు వాస్తవాలకు అద్దం పడుతున్నాయి. మోదీ నమూనా పోయి అక్కడ ఇప్పటికీ కులం, మతం ఆధారంగానే ఓట్లు అడిగే పరిస్థితిలోనే ఉన్నదన్నది అన్నది అర్థమౌతున్నది.

కర్ణాటకపై ప్రజ్వల్ ఉదంతం ప్రభావం

కర్ణాటకలో 28 స్థానాలుండగా రెండో ఫేజ్‌లో 14 స్థానాలకు పోలింగ్ జరగగా.. మూడో ఫేజ్‌లో మిగిలిన స్థానాలకు పోలింగ్ జరిగింది. గత ఎన్నికల్లో 25 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. పార్టీలో సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలతో లోక్‌సభ ఎన్నికల్లో గెలువడం కష్టమనే ఉద్దేశంతోనే గాలిజనార్దన్‌రెడ్డిని తిరిగి పార్టీలోకి తీసుకున్నారనే చర్చలు ఉన్నాయి. ఆ రాష్ట్రంలోని ఎన్నికలను ప్రభావం చేసే లింగాయత్, వొక్కలిగ సామాజిక వర్గాల మెజారిటీ ఓట్లు బీజేపీకే పడేలా యడ్యూరప్ప తనయుడు విజేయేంద్రకు పార్టీ పగ్గాలు అప్పగించింది. వొక్కలిగ సామాజికవర్గానికి చెందిన హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్నది.ఎన్నికలకు ముందు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపులు, ఆయన దౌత్య పాస్‌పోర్ట్‌తోనే దేశం విడిచి వెళ్లడం బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు తెచ్చిపెట్టాయి. ఈ పరిణామాలు ఎక్కడ బీజేపీ పుట్టి ముంచుతాయోనన్న కలవరం ఆ పార్టీ నేతల్లో ఉన్నది. అందుకే ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ప్రజ్వల్‌ను సహించకూడదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. ప్రజ్వల్ ఉదంతం బీజేపీంజేడీఎస్ ఓటు బ్యాంకుపై కచ్చితంగా ప్రభావం చూపిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో 25 సీట్లు గెలుచుకున్న కాషాయపార్టీకి ఈసారి ఎన్నికల్లో భారీగా కోత పడుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

ఉత్తరాదిలోనూ ఎన్డీయేకు సవాల్

ఇక మూడో దశలోనే కీలకమైన మహారాష్ట్రలో 11 చోట్ల, యూపీలో 10 చోట్ల, బీహార్‌లో 7, ఛత్తీస్‌గఢ్‌లో 7, బెంగాల్‌లో 4 చోట్ల పోలింగ్ జరిగింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ంఎన్సీపీ (శరద్‌పవార్)ం శివసేన (యూబీటీ) కూటమి మహా వికాస్ అఘాడీ, బీహార్‌లో ఆర్జేడీంకాంగ్రెస్‌ల మహా ఘట్‌బంధన్, యూపీలో ఎస్పీంకాంగ్రెస్‌ల కూటమి నుంచి బీజేపీకి సవాల్ ఎదురవుతున్నదని పరిశీలకులు అంటున్నారు. బెంగాల్‌లో అధికార తృణమూల్‌తో పాటు కాంగ్రెస్ంవామపక్షాల కూటమి వల్ల అక్కడ త్రిముఖ పోరు తప్పేలా లేదు.2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు జట్టుకట్టి స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాయి. కాంగ్రెస్, వామపక్ష కూటమి బలం పుంజుకోవడం తృణమూలతోపాటు ప్రధానంగా బీజేపీకి పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో ఆ ప్రభావం గత ఎన్నికల్లో 18 సీట్లు గెలుచుకున్న బీజేపీపై



పడుతుందా? లేక 22 సీట్లు గెలుచుకున్న తృణమూల్‌పై పడుతుందా? అన్నది చూడాలి. మొత్తంగా మూడో దశ పోలింగ్ తర్వాత ఎన్డీఏ కూటమికి ఇండియా కూటమి గట్టి పోటీ ఇవ్వడమే కాదు.. సవాల్ విసిరిందనేది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట.

ప్రధాని దక్షిణాది యాత్రలు అందుకేనా?

ఉత్తర భారతదేశంలో పరిస్థితిని అంచనా వేసిన కారణంగానే ప్రధాని దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించడానికి పదే పదే పర్యటిస్తూ ప్రయత్నం చేశారని విశ్లేషకులు చెబుతున్నారు. మోదీ దక్షిణాది రాష్ట్రాల్లో 2022 మే నుంచి 2024 ఏప్రిల్ 17 వరకు కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఏపీలలో 146 సార్లు పర్యటించడం.. ఉత్తరాదిలో ఆ పార్టీకి వచ్చే సీట్లపై నమ్మకం లేదనే సంకేతాలు ఇస్తున్నదని అంటున్నారు.

2019లో బీజేపీ ఏపీ, కేరళ, తమిళనాడులో ఒక్క సీటూ గెలువలేదు. మొదటి రెండు దశల్లో కేరళ, తమిళనాడులలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ముగిసింది. ఈసారి కూడా అక్కడ గత ఫలితాలే పునరావృతమయ్యేలా ఉన్నది. ఇక ఏపీలో 6 చోట్ల, తెలంగాణలో 17 చోట్ల ఆ పార్టీ పోటీ చేస్తున్నది. వీటికి మే 13న పోలింగ్ జరగనున్నది. బీజేపీ పోటీ చేస్తున్న 23 చోట్ల ఎన్ని గెలుచుకుంటుంది? తెలంగాణలో గతంలో గెలిచిన 4 సీట్లను నిలబెట్టుకోగలదా? అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

ఎందుకంటే రాష్ట్రంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాకే బీజేపీ బలం పెరిగిందనే వాదన ఉన్నది. ఇవాళ ఆయన గెలుపు కోసం తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చి ప్రచారం చేయాల్సి వచ్చింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోసం మాజీ గవర్నర్ తమిళి సై రావాల్సి వచ్చింది. తెలంగాణలో ప్రధాని, అమిత్‌షా, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సహా కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు వచ్చారు. కానీ ఆ పార్టీ కచ్చితంగా ఈ సీట్లలో గెలుస్తుంది అని చెప్పలేని పరిస్థితిలో ఉన్నది.

తెలంగాణలో పరిస్థితేంటి?

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయన్న చర్చ జరుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఏ పార్టీ ఎన్ని ఓట్లు వచ్చాయి? ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ సీట్లు ఉన్నాయి? అన్న దాన్ని బేరీజు వేసుకుని విశ్లేషణలు వెలువడుతున్నాయి. కానీ 2018లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించింది. 119 స్థానాలకు 88 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ నాలుగు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 9 స్థానాలకే పరిమితమైంది. 2014లో 63 అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్నప్పుడే 11 లోక్‌సభ సీట్లలో విజయకేతనం ఎగురవేసింది.అంటే 2014లో గెలుచుకున్న 11 సీట్లనే తిరిగి నిలబెట్టుకోలేకపోయింది. ఈసారి కోల్పోయిన సీట్లు కేసీఆర్‌కు షాక్ ఇచ్చినవి కావడం గమనార్హం. ఆ రెండు సీట్లలో ఒకటి కరీంనగర్ నుంచి వినోద్‌కుమార్, నిజామాబాద్ నుంచి కవిత ఓడిపోవడం. కనుక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, మూడ్ ఆఫ్ నేషన్ అన్నవి మాత్రమే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేవు. ఎందుకంటే పదేళ్ల కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత, అనుకూలతలపై ప్రజల తీర్పు ఉంటుంది. ఐదు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రామాణికం అవుతుంది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ నాయకత్వంలో వచ్చిన మార్పు కూడా ఈసారి ఎన్నికల్లో కనిపిస్తుంది. కనుక ఒకటి రెండు అంశాల ఆధారంగానే ఈ పార్టీకి ఇన్ని సీట్లు వస్తాయని చెప్పలేని పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది. రెండు దశల పోలింగ్ ముగిసింది. మూడో దశ పోలింగ్ ఈ నెల 7న నాలుగో దశ మే 13న జరగనున్నది. ఆ తర్వాత మూడ్ ఆఫ్ నేషన్ అనేదానిపై క్లారిటీ రానున్నదని విశ్లేషకులు చెబుతున్నారు.

# పిడుగుల వాన పడే అవకాశం



అమరావతి,రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఈదురుగాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వివరించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొంది. మరోవైపు మంగళవారం కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.4, ప్రకాశం జిల్లా ఎంద్రపల్లిలో 43.2, వైఎస్సార్ జిల్లా మద్దూరు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.9 డిగ్రీల చొప్పున, నెల్లూరు జిల్లా మనుబోలు, నంద్యాల జిల్లా మహానందిలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పిడుగుల వాన కురిసింది. భారీ వర్షానికి, ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అరటి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పిడుగుపాట్లకు ఐదుగురు, వేర్వేరు ఘటనల్లో మరో ఇద్దరు మొత్తం ఏడుగురు మృత్యువాత పడ్డారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో మొక్కజన్న చేలో పనిచేస్తున్న సమయంలో పిడుగుపాటుకు బందల నాగేంద్రం (52), ఆమె కుమార్తె యంద్రపల్లి నాగరాణి (25) మరణించారు. అదే మండలం కుందిరివానిపాలేనికి చెరదిన ఆవుల కోటేశ్వరరావు (45), బాపట్ల జిల్లా సంతమావులూరు గ్రామానికి చెందిన ఆయన మేనల్లుడు గోపి (25) గొర్రెలను మేపుతుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు.

కొబ్బరి చెట్టు విరిగి మీదపడడంతో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మల శ్రీనివాస్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా బరకా కప్పేందుకు మోటార్ సైకిల్‌పై తన బాబారు ఇంటికి వెళ్లి బయట నుంచి ఆయనను పిలుస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆచంటకు చెందిన కౌలు రైతు కంకిపాటి శివయ్య (56) వర్షానికి ధాన్యం బస్తాలు తడవకుండా బరకాలు కప్పుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు ఆచంటలోని సిహెచ్‌సికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం యడవల్లిలో పశువులు మేపేందుకు వెళ్లిన పరస రామారావు (41) పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఈదురు గాలులకు కృష్ణా జిల్లా గుడివాడలో పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో, ట్రాఫిక్ స్తంభించిపోయింది. బస్టాండ్ పూర్తిగా మునిగి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో అరటి చెట్లు, శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కేశవరాయపురం, లావేటిపాలెం, జిజి వలస, లావేరు, సంతవలసలో అరటి, బప్పాయి చెట్లు, ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో అరటి చెట్లు విరిగిపడ్డాయి. కృష్ణా జిల్లా బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, అవనిగడ్డ, నాగాయలంక తదితర మండలాల్లో వర్షానికి, ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజన్న, కళ్లాల్లో ఎండబెట్టిన ఎండు మిర్చి తడిచిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గంటన్నరపాటు భారీ వర్షం కురవడంతో రైల్వే స్టేషన్ రోడ్డు, తాడి తోట, శ్యామలా సెంటర్, కంబాల చెరువు ప్రాంతాలు నీట మునిగాయి. హైటెక్ బస్టాండ్ జలమయమైంది. కడియంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కాకినాడ జిల్లాలో శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు, రెడ్డిగూడెంలో వృక్షాలు నేలకొరిగాయి. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి.

# ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

నెల్లూరు,ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని టిడిపి నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.. ప్రజా సమస్యలు, ప్రభుత్వ బాదుడే బాదుడుపై ప్రజల అభిప్రాయాలు, అవేదన, ఆగ్రహం రాష్ట్రంలోని ప్రభుత్వ వ్యతిరేకతను చాటాయని.. ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న తీరు స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. తెలుగు తమ్ముళ్లలో కసి, ప్రజల్లో తెలుగుదేశం పార్టీపై ఆసక్తి రానున్న మార్పును సూచిస్తున్నాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఏపీ పునర్నిర్మాణం జరుగుతుందని చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాతే రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగుల వేస్తుందన్నారు.. కానీ, జగన్ పాలనా వల్ల రాష్ట్రం అప్పులపాలైందని విమర్శించారు. అయితే, ప్రస్తుతం సీట్లు గురించి చర్చే అవసరం లేదు.. ముందు జగన్ పరిపాలనకు చమరగీతం పాడాలన్నారు.. వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఏపీని వ్యాపారం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సగటు ఏపీ పౌరుడు తలదించుకునే విధంగా జగన్ పరిపాలన ఉందన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రను అపకీర్తిపాలు చేశారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం, ఎమ్మెల్యే సీట్లు కాకుండా అందరూ ఏపీ భవిష్యత్తుకోసం కలిసి రావాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో తొలగని అయోమయం

అమరావతి, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఇంకా అయోమయం నెలకొందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అక్కడ ఇక్కడ అంటూ ఓటు వినియోగించుకోకుండా ఉద్యోగులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌పై చాలా మంది జిల్లా కలెక్టర్లకు, ఆర్వోలకు క్లారిటీ లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులు సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్ దే అని తెలిపారు. ప్రధాని రాక నేపథ్యంలో చాలా మంది అధికారులు ఆ డ్యూటీలో పాల్గొంటున్నందున వారికి రేపు, ఎల్లుండి ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. బయట రాష్ట్రాల్లో విధుల్లో ఉన్న ఏపీ పోలీసులు వారి ఓటు వినియోగించు కునేందుకు పిలిపించాలని.. అలా కుదరని పక్షంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని తెలిపారు. పోలీసు నోడల్ ఆఫీసర్ ఎవరో స్పష్టంగా తెలియపరచాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే హోంగార్డుల జీవన ప్రమాణాలు పెంచే దిశలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీలో పాలనలో చాలా మంది పోలీసులు మానసిక క్షోభ అనుభవించారని... రేపు తాము అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు ఉండవన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గౌరవ ప్రదంగా ఉద్యోగం చేసే పరిస్థితి ఉంటుందని చెప్పుకొచ్చారు. డీజీపీ మారడంతో జగన్ నోట ఓటమి మాట వస్తోందని.. ఎన్నికలు సజావుగా జరిగే అవకాశం లేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓటమిని జగన్ రెడ్డి ముందే ఒప్పుకున్నారంటూ వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు.

# హామీల అమలేదీ?..

న్యూఢిల్లీ,గత రెండు లోక్‌సభ ఎన్నికల సమయాల్లో, అధికారం చేపట్టిన తర్వాత పలు సందర్భాల్లో కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చింది. ప్రధానంగా 2022 నాటికి రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. దేశంలోని నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెప్పింది.విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని దేశానికి వెనక్కి తీసుకొచ్చి, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ ప్రచార సభల్లో ఊదరగొట్టారు.వీటిల్లో ఒక్కటి కూడా అమలు చేసిన పరిస్థితి లేదు.

ఆదాయం కాదు.. ఆత్మహత్యలు రెట్టింపు

ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ హయాంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. 2022 నాటికి దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016 ఫిబ్రవరిలో ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఆదాయం పెరుగుదల విషయం అటుంచితే, దేశంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగాయి. 2014 నుంచి 2023 వరకు దాదాపు లక్షా 12 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారని ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పైగా అన్నదాతల నడ్డివిరిచేలా వివాదాస్పద వ్యవసాయ చట్టాలను మోదీ సర్కార్ తీసుకొచ్చింది. వీటిపై దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమం చేపట్టడంతో వాటిని ఉపసంహరించుకున్నది.

20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా?

ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి పదేండ్లు గడిచినా ఆ హామీ ని నిలబెట్టుకోలేదు. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువకుల్లో దాదాపు సగం మంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొన్నది.

నల్లధనం వెనక్కు తెచ్చారా?

విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం భారీగా మూలుగుతున్నదని, దాన్ని వెనక్కు తీసుకొచ్చి దేశ ప్రజలకు పంచుతామని,ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమచేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఒక్కరి ఖాతాలో కూడా రూపాయైనా జమ కాలేదు. ఇది బీజేపీ చెప్పిన మరొక ఝూఠా మాట అని చెప్పొచ్చు.

బుల్లెట్ రైలు పరుగులు ఎక్కడ?

దేశంలో 2022 నాటికి బుల్లెట్ రైలును అందుబాటులోకి తీసుకొస్తామని 2018 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. జపాన్ సహకారంతో ముంబై–అహ్మదాబాద్ మధ్య ఈ రైలును నడుపుతామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే బుల్లెట్ రైలు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. గడువును ప్రభుత్వం ఏటికేడు పొడిగించుకుంటూ పోతున్నది. 2026నాటికి బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తుందని ఇటీవల రైల్వే మంత్రి పేర్కొన్నారు.

దారుణంగా దెబ్బతిన్న ఆర్థికం!

2022 నాటికి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని మోదీ చెప్పుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా తయారైందనే విమర్శలు వస్తున్నాయి. ద్రవ్యోల్బణంతో సామాన్యుడు అతలాకుతలం అవుతున్నాడు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ఇతర వస్తువులపై పడుతున్నది. మరోవైపు అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎన్నడూ లేని విధంగా అధఃపాతాళానికి పడిపోయింది.

అందరికీ ఇండ్లు.. అందని ద్రాక్షేనా?

2022 నాటికి దేశంలో ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం అవుతుందని 2018 జూలైలో ప్రధాని మోదీ ప్రకటించారు. అయితే పీఎం ఆవాస్ యోజన కింద ఇండ్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నది.

# ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై నిగ్గు తేలేనా



హైదరాబాద్, ఔటర్ రింగ్‌రోడ్డు అవినీతిపై విచారణకు ఆదేశించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి జరగిందని గుర్తించామని అన్నారు. ఎన్నికలకు ముందే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అయినా దీనిపై విపక్ష బిఆర్ఎస్ నోరుమెదపడం లేదు. ఏదైనా ఆరోపణలు రాగానే అంతెత్తు ఎగిరిపడే నేతలు అసలు మట్లాడడం లేదు. ఆనాటి మున్సిపల్ శాఖ మంత్రికెటిఆర్ కూడా దీనిపై పెదవి విప్పడం లేదు. నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని బయట పడేశాక బిజెపి అందుకుంది. ఇప్పుడు సిఎం అయ్యాక రేవంత్ రెడ్డి దీనిపైనా స్పష్టత ఇచ్చారు. విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, విచారణ కాగానే చర్యలు తీసుకుంటామని తాజాగా పలు టీవీ ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. అయితే అవినీతి జరిగివుంటే.. లేదా నిబంధనలకు విరుద్దంగా లీజ్ ఇచ్చివుంటే కేంద్రంలోని బిజెపి చర్యలు తీసుకోవచ్చు. నిజాలు నిగ్గు తేల్చువచ్చు. కానీ బిజెపి కాళేశ్వరం లేదా ఔటర్ లీజల విషయంలో కేవలం ఆరోపణలకే పరిమితం అవుతోంది. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం లీజుకు ఇచ్చే విషయంలో విపరీతమైన వివాదాలు నెలకొంటున్న వేళ నిజాలు నిగ్గు తేల్చాలి. నిజానికి ఓఆర్ఆర్ ను 30 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందన్న దానికి బిఆర్ఎస్ నుంచి సమాధానం రావడం లేదు. అధికారంలో ఉండగానూ, విపక్షంలోనూ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజు తమ అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చుకొని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని నాటి పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశించామని చెప్పారు. హెచ్ఎండీఏ కు ఓఆర్ఆర్ పై టోల్స్ వసూలు చేయడం ద్వారా రాబోయే 30 ఏళ్లలో రూ.75 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంటున్నారు. లీజు ఏ కంపెనీకి టెండరు రావాలో ముందే నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను ఎందుకు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిందని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం లీజు ప్రక్రియ జరగలేదని ఆరోపించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను బట్టి లీజు పరిమితిని తగ్గించుకోవచ్చని నిబంధనల్లో ఉందని, కానీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. ఓఆర్ఆర్‌ను 30ఏళ్ళ వరకు లీజ్‌కు ఇవ్వాల్సిన అవసరం ఏంటన్న దానికి నాటి మంత్రి కెటిఆర్ నుంచి సమాధానం రావడంలేదు. సగటు టోల్ గేట్స్ నుండి వచ్చిన ఆదాయం రోజుకు కోటి ఎనభై ఐదు లక్షలు దాటింది. ఏడాదికి సుమారుగా 720 కోట్లు ఆదాయం వస్తోంది. ముప్పై ఏళ్లపాటు లీజుకు ఇవ్వడమంటే సుమారుగా ఇరవై వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. కానీ తాజా లీజు కారణంగా కేవలం 30వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మరి అంతలా ఆదాయం వస్తున్న ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్స్ లీజును అప్పనంగా ఓ కంపెనీకి కేవలం 7380 కోట్లకు 30 ఏళ్లపాటు ఎలా కేటాయిస్తారంటూ గత ఎన్నికల ముందు ప్రశ్నించారు. వెంటనే ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ గేట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వమే టోల్ గేట్ లను నిర్వహిస్తూ బ్యాంక్ నుండి నిధులు తెచ్చి బ్యాంక్ వడ్డీ చెల్లించినా మంచి లాభాలు వస్తాయని, అలాంటిది ప్రజల సొమ్మును వేలకోట్ల రూపాయలు ఐఆర్‌బి అనే సంస్థకు అప్పగించడం వెనుక ఉన్న గూడుపుఠాణి బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అందులోనూ డిఫాల్టర్ గా ఉన్న ఐఆర్‌బి కంపెనీకి తిరిగి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ టోల్ గేట్ నిర్వహణ ఒప్పందం ప్రక్రియ వెంటనే ఆపకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఈ వ్యహారంపై సిబిఐ, ఈడిల కు ఫిర్యాదు చేయడంతోపాటు ఈ టోల్ గేట్ కుంభకోణంపై పోరాటం చేయనున్నట్లు బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. ఔటర్ వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఆరోపణలు చేశారు. ఇదేనా కేసీఆర్ చెప్పే గుణాత్మకమైన మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీజుతో కల్వకుంట్ల కుటుంబం కొత్త నాటకానికి తెర తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోయడంలో కేసీఆర్ కుటుంబం ఆరి తేరిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అయితే కేంద్రం ఏ ఒక్క అవినీతిపైనా విచారణకు సిద్దంగా ఉండడం లేదు. కేవలం ఆరోపణలతో కాలం గడిపేస్తోంది. ఇప్పుడునెపాలను కాంగ్రెస్ మీదకు నెట్టి చోద్యం చూస్తోంది. కేంద్రం కఠినంగా ఉంటే అవినీతి కార్యకలపాలకు ఆసాకరం ఉండేది కాదు.

# ప్రియాంకను పక్కన పెట్టడంలో ఆంతర్యం?



న్యూఢిల్లీ,కాంగ్రెస్ చేసిన తప్పులనే మళ్లీమళ్లీ చేస్తోంది. రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఫోకస్ చేసే క్రమంలో ప్రియాంకను దూరం పెడుతున్నారు. ఈ దఫా కాంగ్రెస్ కూటమి గెలుస్తుందన్న పూర్తి విశ్వాసంతో ఇండియా కూటమి నేతలు ఉన్నారు. అందుకే సోనియా కూడా రాహుల్‌ను ప్రధానిగా చూడాలని ముచ్చట పడుతున్నారు. ఈ క్రమంలో ప్రియాంకను రాహుల్‌కు పోటీగా రాకుండా ముందే తప్పించారు. పోటీ చేయకుండా పక్కన పెట్టారు. ఇదంతా సోనియా కనుసన్నల్లోనే జరుగుతోంది. కొడుకును మాత్రమే ప్రధానిగా చేయాలనుకుంటున్న సోనియా...ప్రియాంకకు ఉన్న ఛరిష్మాను గుర్తించడం లేదు. ప్రియాంక అచ్చ ఇందిరాలా ఉండడం..ఆమె మాట్లాడినట్లే మాట్లాడడం,. హావభావాలు కూడా అలాగే ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇందిరపై ప్రజల్లో ఇంకా చెరగని ముద్ర ఉంది. దీనిని అందిపుచ్చుకోవాలనే ఆశ కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. కేవలం రాహుల్‌ను ప్రమోట్ చేయడం పనిగా ఎఐసిసి పనిచేస్తోంది. అందుకే ప్రియాంకను ఎన్నికల పోరునుంచి దూర పెట్టారని తెలుస్తోంది. రాహుల్ వయనాడ్ నుంచి పోటీ చేస్తున్నా.. మళ్లీ రాయబరేలిలో నామినేషన్ వేయించారు. నిజానికి ఇక్కడ ప్రియాంక పోటీ చేస్తారన్న ప్రచారం సాగింది. కానీ అనూహ్యంగా ఆమెను పక్కకు తప్పించారు. వయస్సు, అనారోగ్యం రీత్యా ప్రత్యక్ష ఎన్నికలకు దూరం గా ఉండాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ నిర్ణయించుకున్నారు. రెండు నెలల క్రితం రాజస్థాన్ నుండి రాజ్యసభకు ఎన్నిక కావడం ద్వారా రాయ్‌బరేలీ నుండి పోటీ చేయబోవడం లేదనే సంకేతం ఇచ్చారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత అమేథీ వైపు చూడని రాహుల్ గాంధీ అప్పుడు గెలుపొందిన కేరళలోని వాయనాడ్ పైననే దృష్టి కేంద్రీకరిస్తూ ఉండడంతో గాంధీ కుటుంబానికి దశాబ్దాలుగా కంచుకోటలుగా పేరొందిన ఈ రెండు నియోజకవర్గాలను వదిలి వేస్తున్నారా? అనే అభిప్రాయం కలిగింది. మధ్యలో ప్రియాంక గాంధీ తల్లి నియోజకవర్గం నుండి పోటీ చేస్తారని ప్రచారాం సాగినా స్పష్టత లేకుండా పోయింది. ఇదంతా కూడా కావాలని చేస్తున్నట్లుగానే భావించాలి. రాజకీయంగా రాహుల్‌కు అడ్డం కాకూడదనే ఎత్తులు వేస్తున్నారు. అందుకే ప్రియాంకకు ప్రాధాన్యం తగ్గిస్తూ వస్తున్నారు. ఆమెను కేవలం కొన్ని ప్రాంతాలకే ప్రచారానికి పరిమితం చేస్తున్నారు. ఇకపతే కాంగ్రెస్ నేతలంతా రాహుల్ కాబోయే ప్రధాని అని ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌లో మాత్రం ప్రియాంకపై ఉన్న నమ్మకం రాహుల్‌పై ఉండడం లేదు. ఆయనను ముందుకు పెట్టి ఎన్నికలకు వెళితే గెలవమనే బలమైన విశ్వాసంతో ఉన్నారు. ఇకపోతే రాహుల్ అమేథీ నుంచి కాకుండా రాయబరేలి నుంచి రెండో నామినేషన్ వేశారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు అమేథీ నుండి పోటీ చేసేందుకు భయపడ్డారా? అనే ప్రశ్న తలెత్తుతుంది. 2014లో ఓటమి చెందినా నియోజకవర్గాన్ని వదలకుండా అంటిపెట్టుకొని ఉండటం ద్వారా కొంత సానుభూతి పొందడంతో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ 2019లో రాహుల్ గాంధీపై గెలుపొందగలిగారు. అదే విధంగా రాహుల్ సైతం ఓటమి అనంతరం నియోజకవర్గాన్ని వదలకుండా ఉండివుంటే ఇప్పుడు పరిస్థితి మరో విధంగా ఉండేది. దేశంలోనే అత్యధికంగా 80 లోక్‌సభ సీట్లు గల ఉత్తర ప్రదేశ్‌లో రాజకీయంగా పట్టు ఏర్పర్చుకోకుండా జాతీయ రాజకీయాలను శాసింపలేమని భావించే ప్రధాని నరేంద్ర మోడీ వారణాసి నుండి లోక్‌సభకు ఎన్నికవుతున్నారు. అదే విధంగా జాతీయ స్థాయిలో బిజెపిని ఎదిరించగలిగే సామర్థ్యం గల ఏకైక పార్టీగా పేరొందిన కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌ను వదిలి వేయడంతోనే ఇప్పుడు రాజకీయంగా ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అందుకనే కాంగ్రెస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఉత్తరప్రదేశ్ లో పోటీ చేయకుండా వదిలివేయవద్దని చెప్పడంతోనే రాహుల్ చివరకు పోటీకి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. అయితే అమేథీలోనే పోటీ చేసి గెలుపొందాలని మల్లికార్జున్ ఖర్గే వంటి సీనియర్ నేతలు సూచించినట్లు సమాచారం. రాహుల్ గెలుపొందే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పినా పోటీకి వెనుకాడడం ఓ విధంగా కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడవేసింది. అందులకే అమేథీలో ఓడిపోయి వయనాడ్ వెళ్లిన రాహుల్ గాంధీ ఇప్పుడు అక్కడ కూడా ఓడిపోతాడనే భయంతోనే రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ ఎద్దేవా చేయగలిగారు. వాస్తవానికి రాయ్‌బరేలీలో బిజెపికి బలమైన అభ్యర్థి లేరు. ఉమా భారతి నుండి అనేక మంది పేర్లతో సర్వేలు జరిపించినా ఎవ్వరికీ గెలిచే అవకాశాలు లేవని వెల్లడైంది. వరుణ్ గాంధీ అయితే గెలిచే అవకాశాలు ఉన్నాయని సర్వేలు వెల్లడించడంతో ఆయనను పోటీ చేయించాలని జెపి నడ్డా, అమిత్ షా వంటివారు ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు.కాంగ్రెస్ పార్టీలోని పెద్దలతో పాటు సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా గాంధీ కుటుంబం నుండి ఎవ్వరో ఒకరు పోటీచేయాలని పట్టుబట్టడంతో పోటీ చేస్తున్నారు. అయితే ఇప్పుడు రెండు చోట్ల నుండి గెలుపొందితే ఏ సీటుకు రాజీనామా చేస్తారనే ప్రశ్న తలెత్తుతున్నది. నిజానికి ప్రియాంకను పోటీ చేయిస్తే...యూపిలో కూడా పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతాయని అంతా ఆశించారు. కానీ మొత్తంగానే ఆమెను పోటీకి దూరం పెట్టారు. ఇదంతా కుటుంబ వ్యవహారంగా సాగిన డ్రామాగా ప్రచారం సాగుతోంది. పార్టీలో రాహుల్ గాంధీ సమర్థ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయడం కాంగ్రెస్ పార్టీలో పలు కీలక అంశాలలో ఆయన అస్థిర ధోరణిని వెల్లడి చేస్తున్నది. అయితే ఈ దఫా ఎన్నికల్లో మోడీ వ్యతిరేకత కారణంగా బిజెపి ఓడిపోతుందని, కాంగ్రెస్ కూటమి గెలుస్తుంది. బలంగా నమ్ముతున్నారు. అందుకే రాహుల్‌నే ముందుకు పెట్టి కథ నడిపించేలా సోనియా చక్రం తిప్పారు. కొడుకు ప్రధాని అయితే చూడాలని సోనియా ఉ÷–వవీళ్లూరుతున్నారు. అదే ప్రియాంక అయితే ఆమెకు పెద్దగా నాందం ఉండకపోవచ్చు. అందుకే కొడుకు భవిష్యత్ కోసం సోనియా ఆరటపడుతున్నారు. అందుకే ప్రియాంకను పక్కన పెట్టారిన అనుకోవాలి.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం



నిజామాబాద్,ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పా టులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో కల్లాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. ఇటీవలి వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధానన్యం వర్షం ధాటికి కొట్టుకు పోయింది. ఇదంతా మార్కెట్ సిబ్బంది నిర్లక్ష్యం జరిగిందే తప్ప మరోటి కాదు. ధాన్యం రాగానే వెంటనే కాటాలు పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉండటం రైతులకు శాపంగా పరిణమించింది. జిల్లాల్లో కోతలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. పంట దిగుబడికి సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి నప్పటికీ ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. 20 రోజుల క్రితం నుంచే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం ఆచరణలో పెట్టడంలో మాత్రం వెనుకబడి పోయింది. ఫలితంగా ఆరుగాలం శ్రమించి, అధిక వ్యయ ప్రయాసాలకోర్చి సాగు చేసిన వరి పంట మూడు రోజుల క్రితం గాలివాన బీభత్సానికి కకావికలం అయింది. ఇటీవలి కురిసిన అకాల వర్షానికి పంటంతా నీట మునగగా, రైతన్నకు తీరని నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా జిల్లాల్లోవందల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని ఉంటే తమకు అకాల నష్టం జరిగి ఉండేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. యాసంగి సీజన్‌లో ముందుగా సాగు చేసిన చోట దాదాపు నెల రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా దిగుబడి అంచనాకు సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. తీరా పంట కోసి ఆరబెట్టిన తరువాత అ కాల వర్షం కురిసి ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొంత మొత్తం వరదలకు కొట్టుకొని పోయింది. అధికారులు సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి ఉంటే పంటను అమ్ముకొనే వారమని రైతులు వాపోతున్నారు.

# రేషన్ కార్డులు..ఆ తరవాత ఇందిరమ్మ ఇళ్లు



పెద్దపలి,రేషన్ కార్డ్ ఇచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కొంత ఓపిక పట్టండని కోరారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. మంథనిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని వంశీ ఒక యువకుడు, చదువుకున్న వ్యక్తిని అన్నారు. పదిమందికి మంచి జరుగుతుందా అని చూసినోడే ప్రజా నాయకుడని చెప్పారు. కుల బలం, మతబలంతో ఈరోజు తాము రాజకీయాల్లో ఉండాలని రాలేదని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన మూర్ఖత్వాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తాస్తున్నామని అన్నారు. న్యాయంగా పోయే ఎవరిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బంది పెట్టదని చెప్పారు. నాలుగున్నర సంవత్సరాలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంటదని మీరు కాంగ్రెస్ పార్టీ కాకుండా వేరే ఒక పార్టీకి ఓటు వేస్తే వృధాగానే పోతుందని అన్నారు. అభివృద్ధి జరగాలంటే యువకుడైన మన వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసం చేసి బీజేపీ రెండుసార్లు గద్దెనెక్కిందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎంపీగా గడ్డం వంశీని గెలిపిస్తే పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తారన్నారు. పెద్దపల్లిలో ఇవాళ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ బీజేపీని చిత్తుగా ఓడించాలన్నారు. శ్రీరాముని తలంబ్రాలు పంపిణీ బీజేపీ ఎన్నికల స్టంటేనన్నారు. మోడీ పాలనలో ధరలు పెరిగాయన్నారు. గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ సెమీ ఫైనల్లో కేసిఆర్ను ఓడించినట్లుగానే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటే అన్నారు. వంశీకృష్ణను గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబు మాట్లాడుతూ వంశీ గెలిచిన తర్వాత పెద్దపల్లి పార్లమెంటులో ఇండస్ట్రియల్ పార్కు నూటికి నూరు శాతం తీసుకువస్తామన్నారు. అనంతరం పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తనను గెలిపిస్తే పెద్దపల్లికి ప్రభుత్వ రంగ సంస్థలను తీసుకువస్తానని స్పష్టం చేశారు.

### భీమిలి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

విశాఖపట్నం,భీమిలి నియోజకవర్గం మేనిఫెస్టోను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ఎట్టి పరిస్థితిలో మళ్లీ అధికారంలోకి రాకూడదని కూటమి పనిచేస్తుందన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. జూన్ 4న జగన్మోహన్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నారని అన్నారు. వైసీపీ పార్టీ మానిఫెస్టోలో దేనికి పొంతన లేదని... పాత మేనిఫెస్టోని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ఇప్పుడు తాము పొత్తు పెట్టుకున్నామని వివరించారు. గత ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి, నవరత్నాల అమలు చేస్తామని మోసం చేశారన్నారు.

# ప్రజా స్పదంన లేకున్నా బాబు పొట్లు



గుంటూరు, చంద్రబాబు పర్యటనలో జన స్పందన లేకపోయినప్పటికీ అద్భుత ప్రజాదరణ అంటూ ఎల్లో మీడియా బాకాలు పలుకుతోందని జలవనరుల శాఖ మంత్రిఅంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో అంత ఆదరణ ఉంటే చంద్రబాబు ఒంటరిగా ఎందుకు పోటీ చేయరని, అందరూ కలిసి ఎందుకు పోటీకి దిగారని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేక కలిసి పోటీ చేయడానికి వేదిక సిద్ధం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 'పన్నులు లేకుండా ప్రభుత్వాలు నడుస్తాయా.. గతంలో చంద్రబాబు పన్నులు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారా' అంటూ ప్రశ్నించారు. నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకూడదని కుట్రలో భాగంగానే ఈ రాద్ధాంతమంతా చేస్తుంటే, దానికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. అందుకే వైఎస్సార్‌సీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా ఒంటరిగానే ప్రజల మద్దతు కోరుతోందని స్పష్టం చేశారు. ఓటమి భయంతో.. ఎవరికైతే ప్రజల మద్దతు లేదనుకుంటున్నారో.. వాళ్లే పొత్తుల కోసం చూస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లు వేశారు. చంద్రబాబుకు ఎన్నికలలో గెలుస్తామన్న నమ్మకం లేదు. చంద్రబాబును ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అసలు ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. పైగా బాబుది దుర్మార్గపు ఆలోచన. ఎప్పుడూ ఇతరులపైనే ఆధారపడే తత్వం. పైగా వెన్నుపోటు పొడుస్తాడు అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. పెరిగిన ధరలపై చంద్రబాబు అనసర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి గానీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనసర రాజకీయం చేస్తూ ప్రజల మెప్పుకోసం ప్రజల్లోకి రావాలని చూస్తున్నారని అన్నారు. సీఎం జగన్ లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. నరేంద్ర మోడీని వ్యతిరేకిస్తే చంద్రబాబు సంపాందించిన లక్ష కోట్ల రూపాయల అవినీతి బయటపడుతుందని, ప్రశ్నించడం మానేశారని ఎద్దేవా చేశారు. వయసు మీదపడి చంద్రబాబు ఏం చేయాలో తెలియక ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి మండి పడ్డారు.

# క్రూ సిబ్బంది మూకుమ్మడి సెలవులు.. 30 మందిపై సంస్థ వేటు




న్యూఢిల్లీ, టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్)లో నెలకొన్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. సిబ్బంది మూకుమ్మడి సెలవులతో (అనారోగ్య సెలవు) సుమారు 100 విమానాలను ఎయిరిండియా సంస్థ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ రోజు సెలవులు పెట్టి విమాన సేవలకు అంతరాయం కల్పించిన వారిపై సంస్థ తాజాగా చర్యలకు ఉపక్రమించింది. సుమారు 30 మంది సిబ్బందిపై సంస్థ వేటు వేసింది.ఈ మేరకు బుధవారం రాత్రి 30 మంది సిబ్బందికి సంస్థ తొలగింపు (తొలగింపు) నోటీసులు పంపినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. సర్వీస్ రూల్స్ ఉల్లంఘించిన కారణంగా తక్షణమే వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు సంస్థ నోటీసుల్లో పేర్కొంది. సరైన కారణం లేకపోయినా కావాలనే సెలవు పెట్టారని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఇందుకు కారణమని ఉద్యోగులకు పంపిన నోటీసుల్లో సంస్థ.సంస్థ యాజమాన్య విధానాలను నిరసిస్తూ అనారోగ్య కారణాలతో 200 మందికి క్యాబిన్ సిబ్బంది (క్యాబిన్ క్రూ) ఒకేసారి సెలవు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏకంగా 100కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేయాల్సి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది చివరి నిమిషంలో సిక్ లీవ్ పెట్టడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. ఫలితంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రభావం సుమారు 15 వేల మంది ప్రయాణికులపై పడినట్లు వారు తెలిపారు. మరోవైపు విమానాల రద్దుపై నివేదిక సమర్పించాలని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ యాజమాన్య శాఖను పౌరవిమానయాన కోరింది.

### హైకోర్టులో ప్రభుత్వానికి దక్కని ఊరట

అమరావతి,ప్రభుత్వ పథకాలను నిధులు విడుదల చేయాలంటూ ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి మరోసారి నిరాశ ఎదురైంది. లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలకు కూడా నిధులు నిలిపివేయడం తగదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. అయితే నిన్ననే ఈ అంశంపై విచారణ జరిగిందని హైకోర్టు చెప్పింది. బుధవారం దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణను గురువారానికి వాయిదా వేస్తూ హైకోర్టు నిర్ణయించింది. కాగా తాము పథకాలను ఆపి వేయలేదని, అత్యవసరంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com